# ప్రజా తపన

prajathapana.com

*News that matters*




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 54 ఆదివారం 09 ఏప్రిల్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# బంధుప్రీతి తోనే అవినీతిని పెంచి పోషించే వారికి దేశ ప్రయోజనాలతో, సమాజ శ్రేయస్సుతో సంబంధం ఉండదు“

**ప్రజా తపన, హైదరాబాద్:**



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో రూ. 11,300 కోట్ల కు పైగా విలువ చేసే వివిధ ప్రాజెక్టులకు వర్చువల్ గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. బీబీనగర్ ఎయిమ్స్, హైదరాబాద్, ఐదు జాతీయ రహదారి ప్రాజెక్టులకు, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రైల్వేకు సంబంధించిన కొన్ని ఇతర అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన జాతికి అంకితం చేశారు. అంతకుముందు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ లో సికింద్రాబాద్ -తిరుపతి వందేభారత్ ఎక్స్ ప్రెస్ ను ప్రధాన మంత్రి జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మాట్లాడుతూ , తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి వేగాన్ని పెంచే అవకాశంవచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఐటీ సిటీ హైదరాబాద్ ను వేంకటేశ్వర స్వామి కొలువు ఉండే తిరుపతి తో కలిపే సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్ ఎక్స్ ప్రెస్ ను సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ లో జెండా ఊపి ప్రారంభించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. గుర్తు చేశారు.సికింద్రాబాద్-తిరుపతి

(మిగతా 2లో)



# 13 నుంచి 19 వరకు జరాభద్రం

**ప్రజా తపన న్యూఢిల్లీ:**

ఈ ఏడాదిలో తొలిసారిగా ‘హీట్ వేవ్ ’ అలర్ట్ జారీ చేసింది భారత వాతావరణశాఖ (ఐఎండీ). వాయువ్య, ఈశాన్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో ఈ నెల 13 నుంచి 19 వరకు హీట్ వేవ్ కండీషన్ కొనసాగుతుందని వెల్లడించింది. ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు పెరుగుతాయని స్పష్టం చేసింది. అయితే.. మధ్య భారత ప్రాంతంలో మాత్రం ఉష్ణోగ్రతలు తక్కువగానే నమోదవు తాయని పేర్కొంది. ”వాయువ్య, మధ్య భారత ప్రాంతాల్లో డ్రై కండీషన్లు కనిపిస్తున్నాయి. ఉరుములు కూడా తగ్గిపోయాయి. వెస్టెర్న్ టర్బ్యులెన్స్ ఉంటుందని మేము అనుకోవడం లేదు. ఇక ఇప్పుడు ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉన్నాయి. అయితే.. డ్రై కండీషన్ కారణంగా వేడి పెరుగుతుంది. అందుకే వారం రోజుల తర్వాత.. వాయువ్య, ఈశాన్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో హీట్ వేవ్ రావొచ్చు,” అని ఐఎండీ శాస్త్రవేత్త నరేశ్ కుమార్ వెల్లడించారు.: ఒడిశా, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ప్రస్తుతం 38-40 డిగ్రీల సెల్సియెస్ గా నమోదవుతోంది.

(మిగతా 2లో)

# ఇక 24 గంటల వ్యాపారం..

**ప్రజా తపన, హైదరాబాద్:**



తెలంగాణలో వ్యాపారులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. అన్ని దుకాణాలు, వ్యాపార సముదాయాలు 24 గంటలు తెరిచేలా ప్రభుత్వం అంగీకరించింది. దీంతో వ్యాపార వర్గాల నుంచి హర్షం వ్యక్తం అవుతోంది. కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని పేరుతో విడుదలైన జీవో ప్రకారం తెలంగాణలో షాపింగ్ మాల్స్, దుకాణాలు

(మిగతా 2లో)

# దేశంలో కొత్తగా 6,050 కరోనా కేసులు



**ప్రజా తపన న్యూఢిల్లీ:**

గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 6,050 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి. గత 24 గంటల్లో 3,320 మంది కోలుకున్నారు. దీంతో, కోలుకున్నవారి మొత్తం సంఖ్య 4,41,85,858 కు పెరిగింది. రోజువారీ పాజిటివిటీ రేటు 3.39%. వారపు పాజిటివిటీ రేటు 3.02%. గత 24 గంటల్లో చేసిన 1,78,533 కొవిడ్ పరీక్షలతో కలిపి

(మిగతా 2లో)

# భారత్ కు ఉక్రెయిన్ మంత్రి

**ప్రజా తపన న్యూఢిల్లీ:**



రష్యా ఉక్రెయిన్ యుద్ధం మొదలై ఏడాదిన్నర అవుతోంది. ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇప్పట్లో వెనక్కి తగ్గే అవకాశాలూ కనిపించడం లేదు. ఈ వివాదం విషయంలో భారత్ మొదటి నుంచి ఒకే స్టాండ్‌పై ఉంది. అటు రష్యాను విమర్శించకుండా... ఉక్రెయిన్‌కు అండగా ఉంటామని చెబుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఉక్రెయిన్ విదేశాంగ డిప్యూటీ మంత్రి ఎమైన్ జాపరోవా భారత్‌కు రానున్నారు. నాలుగు రోజుల పాటు ఇక్కడే పర్యటించనున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య మొదలు పెట్టినప్పటి నుంచి అధికారికంగా ఆ దేశానికి చెందిన ప్రతినిధి భారత్‌కు రావడం ఇదే తొలిసారి. ఏప్రిల్ 12 వరకూ ఆమె భారత్‌లో పర్యటిస్తారని విదేశాంగ శాఖ అధికారికంగా వెల్లడించింది. పశ్చిమ దేశాల విదేశాంగ వ్యవహారాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కార్యదర్శి సంజయ్ వర్మతో ఆమె భేటీ కానున్నారు. రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. ప్రస్తుతం ఉక్రెయిన్‌లోని స్థితిగతులపైనా చర్చించే అవకాశాలున్నాయి. ఆ తరవాత జారపోవా భారత విదేశీ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ మంత్రి మీనాక్షి లేఖితోనూ సమావేశం కానున్నారు. “ఉక్రెయిన్‌తో ఎన్నో ఏళ్లుగా భారత్ స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తోంది. 30 ఏళ్లలో దౌత్యపరమైన సహకారంతో పాటు వాణిజ్యం, విద్య, సాంస్కృతిక, రక్షణ రంగాల్లో పరస్పరం సహకారం అందించుకుంటున్నాయి. ఇప్పుడు ఉక్రెయిన్ మంత్రి రాకతో ఈ బంధం మరింత బలోపేతం కానుంది”ప్రస్తుతం అందుతున్న సమాచారం మేరకు...ఉక్రెయిన్ మంత్రి మానవతా సాయం కోరనున్నట్టు తెలుస్తోంది. దీంతో పాటు రష్యా దాడుల కారణంగా ధ్వంసమైన మౌలిక వసతులను మరమ్మతు చేసుకునేందుకు ఎక్విప్‌మెంట్‌నూ అడగనున్నట్టు సమాచారం. అంతే కాదు. కీవ్ సందర్శనకు రావాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరే అవకాశాలూ ఉన్నాయి. మానవతా సాయంతో పాటు మెడికల్ ఎక్విప్‌మెంట్, మందులు,మరమ్మతులకు అవసరమైన పరికరాలను ఉక్రెయిన్ భారత్‌ను కోరనుందని అంతర్జాతీయ మీడియా చెబుతోంది. జులైలో రష్యా అధ్యక్షుడు పుతిన్ షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు కోసం భారత్‌కు రానున్నారు. ఈ నేపథ్యంలో...ఉక్రెయిన్ మంత్రి భారత్ పర్యటనకు రావడం ఆసక్తికరంగా మారింది. ఈ సారి భారత్ నేతృత్వంలో జరిగే ఉ20 సదస్సుకి ఉక్రెయిన్‌ను ఆహ్వానించనున్నట్టు సమాచారం.

# బంధుప్రీతి తోనే అవినీతిని పెంచి పోషించే వారికి దేశ ప్రయోజనాలతో, సమాజ శ్రేయస్సుతో సంబంధం ఉండదు“



(మొదటిపేజీ తరువాయి)

వందే భారత్ ఎక్స్ ప్రెస్ విశ్వాసం, ఆధునికత, సాంకేతికత, పర్యాటకాన్ని విజయవంతంగా అనుసంధానిస్తుందని శ్రీ మోదీ అన్నారు. రైల్వేలు, రోడ్డు కనెక్టివిటీ, ఆరోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించి రూ.11,300 కోట్లకు పైగా విలువైన ఈ రోజు ప్రాజెక్టులకు గానూ తెలంగాణ పౌరులను ప్రధాని అభినందించారు.

కేంద్రంలోని ప్రస్తుత ప్రభుత్వంతో సమానంగా తెలంగాణ రాష్ట్రం ఉనికి ప్రారంభం అయిందని, రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నామని ఆయన అన్నారు.

“తెలంగాణ అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర ప్రజల కలలను సాకారం చేయాల్సిన బాధ్యత కేంద్రంలోని ప్రభుత్వానిదే” అని అంటూ, ‘సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్’ స్ఫూర్తి ని శ్రీ మోదీ ప్రముఖంగా పేర్కొన్నారు. గత తొమ్మిదేళ్లుగా భారత్ రూపొందించిన అభివృద్ధి నమూనాను తెలంగాణ సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు.

నగరాలలో అభివృద్ధికి ఉదాహరణలు పేర్కొంటూ, గత తొమ్మిదేళ్లలో 70 కిలోమీటర్ల మేర నిర్మించిన మెట్రో నెట్ వర్క్ ను, హైదరాబాద్ మల్టీ మోడల్ ట్రాన్స్ పోర్ట్ సిస్టం (ఎంఎంటీఎస్ ) అభివృద్ధిలో సాధించిన పురోగతిని వివరించారు. ఈ రోజు 13 ఎంఎంటీఎస్ సర్వీసులను ప్రారంభించడం గురించి ప్రస్తావిస్తూ, హైదరాబాద్, సికింద్రాబాద్, సమీప జిల్లాల్లోని లక్షలాది మంది పౌరులకు ప్రయోజనం చేకూర్చడంతో పాటు కొత్త వ్యాపార కేంద్రాలు, పెట్టుబడులకు ఊతమిచ్చేలా తెలంగాణకు రూ.600 కోట్లు కేటాయించినట్లు ప్రధాని తెలిపారు.

కోవిడ్ -19 మహమ్మారి , రెండు దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధం కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు అనూహ్యంగా క్షీణించాయని పేర్కొన్న ప్రధాన మంత్రి, అయినా ఆధునిక మౌలిక సదుపాయాల కోసం రికార్డు స్థాయిలో పెట్టుబడులు పెట్టిన కొద్ది దేశాలలో భారతదేశం ఒకటని స్పష్టం చేశారు. ఈ ఏడాది బడ్జెట్ లో భారత్ లో ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.10 లక్షల కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు.

గత తొమ్మిదేళ్లలో తెలంగాణ రైల్వే బడ్జెట్ పదిహేడు రెట్లు పెరిగిందని, కొత్త రైలు మార్గాలు, రైల్వే లైన్ డబ్లింగ్, విద్యుదీకరణ తదితర పనులు రికార్డు సమయంలో జరిగాయన్నారు. సికింద్రాబాద్ - మహబూబ్ నగర్ ప్రాజెక్టు విద్యుదీకరణ ఇందుకు ప్రధాన ఉదాహరణ అని, హైదరాబాద్ - బెంగళూరు మధ్య కనెక్టివిటీ మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు.

దేశంలోని ప్రధాన రైల్వే స్టేషన్లను ఆధునీకరించే కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి ప్రాజెక్టు ను చేపట్టినట్లు ప్రధాన మంత్రి చెప్పారు.

రైల్వేలతో పాటు తెలంగాణలో హైవే నెట్ వర్క్ ను కూడా శరవేగంగా అభివృద్ధి చేస్తున్నామని చెబుతూ ఈ రోజు శంకుస్థాపన చేసిన నాలుగు హైవే ప్రాజెక్టులను ప్రధాని ప్రస్తావించారు. రూ.2300 కోట్లతో నిర్మిస్తున్న హైవేలో అక్కల్కోట్-కర్నూలు సెక్షన్, రూ.1300 కోట్లతో మహబూబ్నగర్-చించోలి సెక్షన్, రూ.900 కోట్లతో కల్వకుర్తి-కొల్లాపూర్ సెక్షన్, రూ.2700 కోట్లతో ఖమ్మం-దేవరపల్లి సెక్షన్ వీటిలో ఉన్నాయి. తెలంగాణలో అధునాతన రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి వనరులతో నాయకత్వం వహిస్తోందని ప్రధాని ఉద్ఘాటించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాడు జాతీయ రహదారుల పొడవు 2500 కిలోమీటర్లు ఉండగా నేడు 5 వేల కిలోమీటర్లకు పెరిగిందని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం రూ.35 వేల కోట్లు ఖర్చు చేసిందని శ్రీ మోదీ చెప్పారు. ఆటను మార్చే హైదరాబాద్ రింగ్ రోడ్డుతో సహా తెలంగాణలో రూ.60 వేల కోట్ల విలువైన రోడ్డు ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

తెలంగాణలో పరిశ్రమలు, వ్యవసాయం రెండింటి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. రైతుకు, శ్రామికుడికి బలాన్నిచ్చే పరిశ్రమల్లో టెక్స్ టైల్ ఒకటని, దేశవ్యాప్తంగా 7 మెగా టెక్స్ టైల్ పార్కులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, వాటిలో తెలంగాణ కూడా ఒకటని ప్రధాని తెలిపారు. తద్వారా యువతకు కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. బీబీనగర్ ఎయిమ్స్ కు నేడు శంకుస్థాపన చేయడాన్ని ప్రస్తావిస్తూ, తెలంగాణలో విద్య, వైద్య రంగాల్లో కూడా కేంద్ర ప్రభుత్వం పెట్టుబడులు పెడుతోందన్నారు. నేటి ప్రాజెక్టులు తెలంగాణలో (సులభ ప్రయాణం ) , ఈజ్ ఆఫ్ ట్రావెల్), సులభ జీవనం (ఈజ్ ఆఫ్ లివింగ్), సులభ వ్యాపారం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పెంచుతాయని చెప్పారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవడంతో పలు కేంద్ర ప్రాజెక్టులు పూర్తికావడంలో జాప్యం జరుగుతోందని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందువల్ల తెలంగాణ ప్రజలే నష్టపోతున్నారని, అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు కల్పించవద్దని, ప్రక్రియ ను. వేగవంతం చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

దేశప్రజల ఆశలు, ఆకాంక్షలు, కలలను నెరవేర్చడానికి తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరిస్తూ ప్రధాన మంత్రి, అయితే అభివృద్ధి , పురోగతిని చూసి కొద్దిమంది చాలా ఆందోళన చెందుతున్నారని అన్నారు. బంధుప్రీతి, అవినీతిని పెంచిపోషిస్తున్న వారికి దేశ ప్రయోజనాలతో పాటు సమాజ శ్రేయస్సుతో సంబంధం లేదని, వారు నిజాయితీగా పనిచేసే వారికి కూడా సమస్యలు సృష్టిస్తున్నారని ఆయన విమర్శించారు. వారు ప్రతి ప్రాజెక్టులోనూ, పెట్టుబడుల విషయంలోనూ తమ కుటుంబ ప్రయోజనాలే చూసుకుంటున్నారని, అది గుర్తించాలని ఆయన తెలంగాణ ప్రజలను హెచ్చరించారు. అవినీతికి, బంధుప్రీతికి ఉన్న సారూప్యతలను వివరిస్తూ, బంధుప్రీతి ఉన్నప్పుడు అవినీతి వృద్ధి చెందడం ప్రారంభమవుతుందని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు.

“కుటుంబవాదం, వంశపారంపర్య రాజకీయాల ప్రధాన మంత్రం నియంత్రణ” అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. ఇటువంటి సూత్రాలపై తన విమర్శలను మరింత ముందుకు తీసుకెళ్లిన ప్రధాన మంత్రి, రాజవంశాలు ప్రతి వ్యవస్థపై తమ నియంత్రణను నిలుపుకోవాలనుకుంటాయని, ఎవరైనా వారి నియంత్రణను సవాలు చేసినప్పుడు ద్వేషిస్తారని అన్నారు.

ప్రత్యక్ష ప్రయోజనాల బదిలీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ ఫర్ సిస్టమ్) ను, దేశవ్యాప్తంగా డిజిటల్ పేమెంట్ ను ప్రోత్సహించడాన్ని ఉదాహరణగా చూపుతూ, ఏ లబ్ధిదారుడికి ఎలాంటి ప్రయోజనం కలుగుతుందో నియంత్రించే కుటుంబ పాలకుల వైపు వేలెత్తి చూపుతూ, ఈ పరిస్థితి నుంచి ఉద్భవించే మూడు అర్థాలను వివరించారు. మొదటిది, కుటుంబాన్ని ప్రశంసిస్తూనే ఉండాలని, రెండోది అవినీతి సొమ్ము కుటుంబానికి వస్తూనే ఉండాలని, మూడవది పేదలకు పంపే డబ్బు అవినీతిపరుల చేతికి అందుతూనే ఉండాలని ప్రధాని అన్నారు. “ఈ రోజు మోదీ అవినీతికి అసలు మూలమైన ఈ దాడి చేశారు. అందుకే వీళ్లు వణికిపోతున్నారు, ఏ పని చేసినా కోపంతోనే చేస్తున్నారు’ అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. “దీనిపై కోర్టుకు కూడా వెళ్లిన రాజకీయ పార్టీలకు ఎదురు దెబ్బ తగిలింది“ అన్నారు.

సబ్ కా వికాస్ (ప్రతి ఒక్కరి అభివృద్ధి) స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని నిజమైన అర్థంలో బలోపేతం చేసినప్పుడే రాజ్యాంగ నిజమైన స్ఫూర్తి సాకారమవుతుందని అన్నారు. 2014లో కేంద్ర ప్రభుత్వం వారసత్వ రాజకీయాల సంకెళ్ల నుంచి విముక్తి పొందిన ఫలితాన్ని దేశం మొత్తం చూస్తోందని ప్రధాని పునరుద్ఘాటించారు.

గత తొమ్మిదేళ్లలో దేశంలోని 11 కోట్ల మంది తల్లులు, సోదరీమణులు, ఆడబిడ్డలకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించామని, ఇందులో తెలంగాణకు చెందిన 30 లక్షల కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. గత 9 ఏళ్లలో దేశంలో 9 కోట్లకు పైగా అక్కాచెల్లెళ్లు, ఆడబిడ్డలకు ఉచిత ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని, ఇందులో తెలంగాణలోని 11 లక్షలకు పైగా పేద కుటుంబాలు ఉన్నాయని తెలిపారు.

నేడు తమ ప్రభుత్వంలో 80 కోట్ల మంది పేదలకు ఉచిత రేషన్ అందిస్తున్నామని, పేదలకు రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని, తెలంగాణలో తొలిసారి కోటి కుటుంబాలకు జన్ ధన్ బ్యాంకు ఖాతాలు తెరిచామని, తెలంగాణలోని రెండున్నర లక్షల మంది చిరు వ్యాపారులకు గ్యారంటీ లేకుండా ముద్రా రుణాలు వచ్చాయని తెలిపారు. 5 లక్షల మంది వీధి వ్యాపారులకు తొలిసారి బ్యాంకు రుణాలు లభించగా, తెలంగాణలోని 40 లక్షల మందికి పైగా చిన్న రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద సుమారు రూ.9 వేల కోట్లు అందాయి.

దేశం ‘తుష్టికరణ్’ (కొందరి తృప్తి) నుంచి ‘సంతుష్టికరణ్’ (అందరి సంతృప్తి) వైపు మళ్లినప్పుడు నిజమైన సామాజిక న్యాయం పుడుతుంది’ అని ప్రధాన మంత్రి అన్నారు. తెలంగాణతో సహా యావత్ దేశం సంతులిత బాటలో నడవాలని, సబ్ కా ప్రయాస్ తో అభివృద్ధికి తోడ్పడాలని కోరుకుంటోందన్నారు. “ఆజాదీ కా అమృత్ కాల్ లో అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడానికి తెలంగాణ త్వరితగతిన అభివృద్ధి చెందడం చాలా ముఖ్యం” అని ప్రధాన మంత్రి అన్నారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో రాబోయే 25 సంవత్సరాల ప్రాముఖ్యతను ప్రముఖంగా ప్రస్తావిస్తూ ముగించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర రైల్వే శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు.

రూ.720 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి ప్రాజెక్టు లో ప్రపంచ స్థాయి సౌకర్యాలు, సుందరంగా డిజైన్ చేసిన ఐకానిక్ స్టేషన్ భవనంతో పెద్దఎత్తున రూపు రేఖలు మార్చే ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

రైల్ నుంచి ఇతర మార్గాల్లోకి ప్రయాణికులను నిరాటంకంగా తరలించేందుకు మల్టీమోడల్ కనెక్టివిటీతో పాటు అన్ని ప్రయాణీకుల సౌకర్యాలతో డబుల్ లెవల్ విశాలమైన రూఫ్ ప్లాజాను అభివృద్ధి చేయనున్నారు.

ఈ కార్యక్రమంలో, ప్రయాణికులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణ ఎంపికను అందిస్తూ, హైదరాబాద్ - సికింద్రాబాద్ జంట నగరాల సబర్బన్ విభాగంలో 13 కొత్త మల్టీ-మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్ (ఎం ఎం టి ఎస్ ) లను ప్రధాన మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. సికింద్రాబాద్ -మహబూబ్ నగర్ ప్రాజెక్టు డబ్లింగ్ , విద్యుదీకరణను ఆయన జాతికి అంకితం చేశారు. దాదాపు రూ.1,410 కోట్ల వ్యయంతో 85 కిలోమీటర్ల మేర ఈ ప్రాజెక్టును పూర్తి చేశారు. ఈ ప్రాజెక్టు అంతరాయం లేని కనెక్టివిటీని అందిస్తుంది. రైళ్ల సగటు వేగాన్ని పెంచుతుంది.

హైదరాబాద్ బీబీనగర్ ఎయిమ్స్ కు ప్రధాని శంకుస్థాపన చేశారు. దేశవ్యాప్తంగా ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలన్న ప్రధాని దార్శనికతకు ఇది నిదర్శనం. బీబీనగర్ ఎయిమ్స్ ను రూ.1,350 కోట్లకు పైగా వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు.

బీబీనగర్ ఎయిమ్స్ ఏర్పాటు తెలంగాణ ప్రజలకు సమగ్ర, నాణ్యమైన, సంపూర్ణ ఆరోగ్య సేవలను వారి ఇంటి ముంగిటకే అందించడంలో ఒక ముఖ్యమైన మైలురాయి.

ప్రధాని శంకుస్థాపన చేసిన రూ.7,850 కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య రహదారి అనుసంధానాన్ని బలోపేతం చేయడంతో పాటు ఈ ప్రాంత సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదపడతాయి.

## 13 నుంచి 19 వరకు జరాభద్రం

(మొదటిపేజీ తరువాయి)

వాయువ్య భారతం, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2-3 డిగ్రీలు తక్కువగా ఉన్నాయి. అయితే.. రానున్న ఐదు రోజుల్లో వాయువ్య, మధ్య, ఈశాన్య భారతంలోని అనేక చోట్ల ఉష్ణోగ్రతలు 2-4 డిగ్రీలు పెరిగే అవకాశం ఉంది. తెలంగాణ, మధ్య ఒడిశాలో 2-3 డిగ్రీలు పెరగొచ్చు. అయితే మహారాష్ట్రలో మాత్రం రానున్న 3 రోజుల పాటు ఉరుములతో కూడిన వర్షాలు పడొచ్చని ఐఎండీ అంచనా వేసింది.”ఇక్కడి నుంచి ఉష్ణోగ్రతలు నిదానంగా పెరుగుతాయి. మధ్య, వాయువ్య భారతంలో వాతావరణ మార్పులు కనిపిస్తున్నాయి. రానున్న 2 రోజుల పాటు ఉష్ణోగ్రతలు సాధారణం, సాధారణం కన్నా కాస్త ఎక్కువగా ఉంటాయి. 5-7 రోజుల తర్వాత.. వాయువ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో హీట్?వేవ్? వస్తుంది. ఈ నెల మూడో వారానికి ఆ హీట్ వేవ్ ఢిల్లీకి విస్తరించే అవకాశంఉంది,” అని స్కైమెట్ పేర్కొంది. హీట్‌వేవ్ నేపథ్యంలో ప్రజలకు హెచ్చరికలు జారీచేసింది వాతావరణశాఖ. జూన్ వరకు పరిస్థితులు ఆందోళనకరంగా ఉంటాయని పేర్కొంది. అవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లొద్దని సూచించింది. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఆరోగ్యంగా ఉండేందుకు అన్ని చర్యలు చేపట్టాలని వివరించింది.

## ఇక 24 గంటల వ్యాపారం..

(మొదటిపేజీ తరువాయి)

24 గంటలూ తెరిచేలా అనుమతి ఇచ్చారు. దీని కోసం ఏటా ప్రభుత్వానికి పదివేల రూపాయలు చెల్లించాలి. తెలంగాణ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 1988కు సవరణలు చేసిన ప్రభుత్వం ఈ మేరకు 24 గంటలు షాపులు తెరిచేలా అనుమతి ఇచ్చారు.

ఇలా 24 గంటల పాటు తెరిచి ఉంచేందుకు షాపులు, షాపింగ్ మాల్స్ నిర్వాహకులు కొన్ని రూల్స్ పాటించాల్సి ఉంటుంది. సిబ్బందికి ఐడీ కార్డులు ఇవ్వాల్సి ఉంటుంది. వారికి వీక్లీహాలిడేస్ మస్ట్‌గా ఇవ్వాలని ప్రభుత్వం చెప్పింది. కచ్చితమైన పని గంటల్లో వారితో పని చేయంచుకోవాలి. ఓవర్ టైం చేస్తే మాత్రం ప్రత్యేక వేతనం ఇవ్వాలి. పండగలు, సెలవు దినాల్లో పని చేసేవారికి కాంపెన్సేటరీ లీవులు కూడా ఇవ్వాలి.మహిళా ఉద్యోగులకు ప్రత్యేక వేతనం ఇవ్వాలి. రాత్రి షిఫ్టులో పని చేసేందుకు అంగీకరిస్తేనే మహిళలకు డ్యూటీలు వేయాలి. వారికి తగిన భద్రత కల్పించాలి. వారికి రవాణా సౌకర్యం కూడా కల్పించాలి. రికార్డులను సరిగా నిర్వహించాలి. పోలీస్ యాక్ట్ రూల్స్ మస్ట్‌గా ఫాలో అవ్వాలి. ఇవన్నీ ఉంటే తప్ప అలాంటి షాపులను 24 గంటలూ తెరిచేలా అనుమతులు ఇవ్వబోరు.

## దేశంలో కొత్తగా 6,050 కరోనా కేసులు

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటివరకు 92.25 కోట్ల పరీక్షలు చేశారు.గత 24 గంటల్లో 2,334 డోసులు అందించారు. దేశవ్యాప్త క్రియాశీల కేసుల సంఖ్య 28,303. మొత్తం కేసుల్లో క్రియాశీల కేసులు 0.06%. ప్రస్తుత రికవరీ రేటు 98.75%. గత 24 గంటల్లో 3,320 మంది కోలుకున్నారు. దీంతో కోలుకున్నవారి మొత్తం సంఖ్య 4,41,85,858 కు పెరిగింది.

## డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతిని జయప్రదం చేయండి

**నందవరం**

ఏప్రిల్ 14న ఎమ్మిగనూరు పట్టణంలో ఎమ్మార్వో ఆఫీస్ ఆవరణంలో వేలాది మందితో నిర్వహించ తలపెట్టిన భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బాబాసాహెబ్ డా.బి.ఆర్. అంబేద్కర్ గారి 132 వ జయంతి ఉత్సవాలకు ప్రతి గ్రామము నుండి దళితులు పెద్ద ఎత్తున కదిలి వచ్చి జయప్రదం చేయాలని డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు యస్. దేవసహాయం, కో - కన్వీనర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జి. ఆనంద్ చైతన్య మాదిగలు కోరారు. వారు శనివారం నందవరం మండలంలోని హాలహార్వి,ఇబ్రహీం పురం, నది కైరవాడి, సజీవ పురం, నాగుల దిన్నే గ్రామాల్లో పర్యటించి సమావేశాలు ఏర్పాటు చేశారు. ప్రతి పల్లెలో దళితవాడల్లో అంబేద్కర్ జయంతి పోస్టర్లను ఆవిష్కరించారు. ఇంటింటా అంబేద్కర్ జయంతి ఉత్సవాల కరపత్రాలను పంచి పెట్టారు. అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ ఉపాధ్యాయులు “ఎరుకల కృష్ణ” అధ్యక్షతన జరిగే ఈ బహిరంగ సభకు రాజకీయాలకు అతీతంగా, దళితుల ఐక్యతను ప్రదర్శిస్తూ... భారీ ఎత్తున తరలిరావాలని



పిలుపునిచ్చారు. 14వ తేదీ శుక్రవారం ఉదయం 9:30 గంటలకు ఎమ్మిగనూరు పట్టణంలోని ఎం.బి. చర్చి దగ్గర గల ఆది ఆంధ్ర పాఠశాల నుండి సభా స్థలం ఎమ్మార్వో ఆఫీస్ వరకు భారీ ర్యాలీ, వందలాది డప్పులతో “డప్పుల దరువు”, కర్ర సాము విన్యాసాలతో ... ప్రదర్శన చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో... దళిత గిరిజనులకు రక్షణ కరువైందని, దాడులు, హత్యలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు, అరాచకాలు దళితులపై రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కనకవీడు రాజు, మాల పూజారి నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ జేఏసీ నిరసన

**అనకాపల్లి**

ఏపీ జేఏసీ అమరావతి అనకాపల్లి జిల్లా శాఖ చైర్మన్ సింగంపల్లి వాసు ఆధ్వర్యంలో శనివారం నాడు నల్ల బ్యాడ్జీలతో ప్లేకోర్టులతో నిరసన ర్యాలీ తో ఆర్ డి ఓ కార్యాలయం ,నెహ్రూ జంక్షన్ లో ప్రదర్శన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఆర్సి ఏరియర్స్ నాలుగు నెలల బకాయిలు డీఏలు విడుదల చేయాలని సిపిఎస్ రద్దు పాత పింఛన్ అమలు చేయాలని ఒకటో తేదీ కల్లా జీతాలు పెన్షన్ ఇవ్వాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలని జీతాలు పెంపు సచివాలయ ఉద్యోగులు బదిలీలు 9 నెలలు రెగ్యుల రై జేషన్ జీతాలు విడుదల చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి లవ్ రాజు మాట్లాడుతూ కారుణ్య నియమాలు హెల్త్ కార్డులు అమలు చేసి బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎలమంచిలి శ్రీరామ్ మూర్తి ,కామరెడ్డి దేవుడు, జి వైకుంఠరావు, టి వెంకటరమణ, దిలీప్, ఏవి హెచ్ శాస్త్రి ,శ్రీనివాసరావు ,మహేష్, నాయుడు, శేఖర్, జైయ శ్రీ, జ్యోతి ,సూర్య కళ, వీఆర్ఏలు పాల్గొన్నారు.

## కడెం ప్రాజెక్టులో పడి ఒకరు మృతి

**నిర్మల్**

నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఒకరు మృతి చెందారు,. ప్రాజెక్ట్ వద్ద లస్కర్ గా విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఇరిగేషన్ ఉద్యోగి బద్ది గంగాధర్ (53) ప్రమాదవశాత్తు వరద గేట్ల పైనుండి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అటెండర్ పనుల నుంచి అధికారుల విధుల వరకు పనులు చేయాల్సి వస్తోందని కుటుంబ సభ్యుల ఆరోపించారు. గంగాధర్ మృతికి ప్రాజెక్ట్ అధికారులే బాధ్యత వహించాలని స్థానికుల డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకోని . దర్యాప్తు చేస్తున్నారు.

# మొన్న లోకేష్.. నేడు చంద్రబాబు..

**అభివృద్ధిపై సీఎం జగన్‌కు సెల్ఫీ ఛాలెంజ్‌లు**

**అనంతపురం:**

ఆంధ్రప్రదేశ్ లో ఎప్పుడో ఎన్నికల వేడి మొదలైంది. అధికార పార్టీ వైసీపీ పార్టీ నేతల మధ్య ప్రతి పక్ష నేతల మధ్య మాటల యుద్ధం ఓ రేంజ్ లో సాగుతుంది. సీఎం జగన్ సహా మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ గత ప్రభుత్వం పనితీరు అంటూ టీడీపీ నేతలపై మాటల తూటాలు విడుస్తున్నారు. ప్రభుత్వ పని తీరు ఇది అంటూ పాదయాత్ర చేస్తోన్న టీడీపీ నేత నారా లోకేష్ తో పాటు పలువురు నేతలు సవాల్ విసురుతున్నారు. ఇప్పటికే లోకేష్ అనంతపురం జిలాల్లో ఉన్న కియా సంస్థ ముందు సెల్ఫి దిగి ఛాలెంజ్ విసరగా.. తాజాగా టీడీపీ అధ్యక్షులు ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు వంతు వచ్చింది. సీఎం సీఎం జగన్‌కు చంద్రబాబు సెల్ఫీ చాలెంజ్ విసిరారు. ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి సెల్ఫీ సవాల్ విసిరారు మాజీ సీఎం చంద్రబాబునాయుడు. నెల్లూరులో టిడ్కో కాలనీ ముందు ఫోటోలు దిగిన చంద్రబాబు సోషల్ మీడియాలో పోస్ట్ చేసి? సీఎం జగన్‌కు సవాల్ విసిరారు. గత ప్రభుత్వంలో పేదల కోసం కట్టిన వేలాది ఇళ్లు ఇవి?రాష్ట్రంలో నాడు నిర్మించిన లక్షల టిడ్కో ఇళ్లకు సజీవ సాక్ష్యాలని చెప్పారు. మరి నాలుగేళ్లలో మీరు నిర్మించిన పేదల ఇళ్లు ఎన్నో లెక్క చెప్పగలరా.. అసలు మీరు కట్టిన ఇళ్లెన్నో చూపించగలరా జగన్ అంటూ చంద్రబాబు ట్యాగ్ చేశారు.నెల్లూరులో ఏర్పాటు చేసిన టీడీపీ ప్రాంతీయ సదస్సులో టీడీపీ అధినేత చంద్రబాబు మాట్లాడుతూ.. అంతేకాదు వై నాట్ కుప్పం అని వైసీపీ నేతలు హేళన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తారు. మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత ఏపీలో పొలిటికల్ మూడ్ మారిపోయిందన్నారు. ఇకపై టీడీపీ గురి వై నాట్ పులివెందులేనని చెప్పారు చంద్రబాబు.

# విష్ణువర్ధన్ రెడ్డి యత్నం...కమలం గూటికి కిరణ్

**అనంతపురం:**

ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి భారతీయ జనతా పార్టీలో చేరడం అనూహ్య పరిణామం. ఆయన కాంగ్రెస్ పార్టీకి వీర విధేయుడు. రాష్ట్ర విభజన నిర్ణయంతో పార్టీపై విశ్వాసం కోల్పోయారు. తర్వాత మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరినా యాక్టివ్ కాలేకపోయారు. కాంగ్రెస్ హైకమాండ్ తన సూచనలు పట్టించుకోకపోవడం ఎలాంటి బాధ్యతలు ఇవ్వకపోవడంతో ఆయన సైలెంట్ అయిపోయారు. అయితే బీజేపీలో చేరడం మాత్రం అనూహ్యం. కిరణ్‌ను బీజేపీలోకి తీసుకురావడంలో ఏపీబీజేపీ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఆయన నిరంతరం.. అటు హైకమాండ్‌తో ఇటు కిరణ్ కుమార్ రెడ్డితో చర్చలు జరిపి బీజేపీలో చేరికకు మార్గం సుగమం చేసినట్లుగా తెలుస్తోంది. విష్ణువర్ధన్ రెడ్డి విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించారు. కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే రాష్ట్ర విభజన జరిగింది. అయితే ఈ విభజనను కిరణ్ కుమార్ రెడ్డి వ్యతిరేకించారు. ఆ సమయంలో సమైక్యాంధ్ర ఉద్యమం ప్రారంభించారు. ఆ సమయంలో పదవులు ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతలు ఎవరూ కిరణ్ కుమార్ రెడ్డితో నడవడానికి ముందుకు రాలేదు. కానీ రాయలసీమ జిల్లాల నుంచి విష్ణువర్ధన్ రెడ్డి.. కిరణ్ కుమార్ రెడ్డి చేపట్టిన సమైక్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆ సమయంలో కిరణ్ కుమార్ రెడ్డికి విష్ణువర్ధన్ రెడ్డి సన్నిహితమయ్యారు. అప్పట్నుంచి ఉన్న సన్నిహిత సంబంధాలతో ఇప్పుడు పార్టీని బలోపేతం చేయడానికి విష్ణువర్ధన్ రెడ్డి ఉపయోగించుకున్నారు. సమైక్యాంధ్ర ఉద్యమం తర్వాత రాష్ట్ర విభజన జరగడంతో పూర్తి స్థాయిలో బీజేపీలో యాక్టివ్ అయిన విష్ణువర్ధన్ రెడ్డి నెహ్రూ యువ కేంద్ర వైస్ చైర్మన్‌గా సమర్థంగా పని చేస్తూ జాతీయ స్థాయి నేతల అభిమానాన్ని చూరగొన్నారు. పార్టీ బలోపేతం కోసం విష్ణువర్ధన్ రెడ్డి కష్టపడే తీరు పెద్దలకు నచ్చింది. కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీలో చేరితే మంచి ఫలితాలు వస్తాయని ఆయన భావించారు. మొదట కిరణ్ కుమార్ రెడ్డిని సంప్రదించారు. ఏపీలో బీజేపీ ఎదడగానికి ఉన్న అవకాశాలపై చర్చించి.. పార్టీలో చేరేలా ఒప్పించారు. తర్వాత విష్ణువర్ధన్ రెడ్డి బీజేపీ హైకమాండ్ పెద్దలతోనూ మాట్లాడారు. నిజానికి మాజీ ముఖ్యమంత్రి స్థాయి నేతను పార్టీలో చేర్చుకోవాలంటే చిన్న విషయం కాదు. ఎందుకంటే పార్టీలో చేరే ఆ నేతకు సముచిత గౌరవం ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటి సమస్యలన్నింటినీ విష్ణువర్ధన్ రెడ్డి పరిష్కరించారు. ఇటు కిరణ్ రెడ్డితో అటు హైకమాండ్‌తో సంప్రదింపులు జరిపి చివరికి లైన్ క్లియర్ చేశారు. ఆయన పట్టుదల ఫలించి కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీ సభ్యుడయ్యారు. అందుకే ఢిల్లీలో కిరణ్ రెడ్డి బీజేపీలో చేరిక సమయంలో కూడా విష్ణువర్ధన్ రెడ్డి కీలకంగా వ్యవహరించారు.

# కడపలో పట్టాలెక్కని పరిశ్రమలు

**కడప:**

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తుందనే ఆశలు కల్పించింది విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్. ఇందులో ఒప్పందాలు కడప జిల్లాకు అనేక పరిశ్రమలను పరుగులు పెట్టించనున్నాయనే భ్రమలు కల్పించాయి. అయితే ఒప్పందాలు జరిగి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కడప జిల్లాకు వచ్చే పరిశ్రమలు ఏమిటి? ఏయే రకాల పరిశ్రమలు వస్తున్నాయి. ఏ పరిశ్రమ ఎంత పెట్టుబడితో రానుంది ? వీటికి ఎంత భూమి కావాలి ? ఇలాంటి ఏ సమాచారం ఇప్పటి వరకు జిల్లా కేంద్రానికే అందకపోవడంతో ఈ ఒప్పందాల సంగతేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.మార్చి మూడో తేదీన విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కడప జిల్లా కొప్పర్తిలో ఏర్పాటైన ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లో 21 పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు రూ.1500 కోట్లతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ సీఈవో గౌతమి అప్పట్లో వెల్లడించారు. ఈ పరిశ్రమల ద్వారా 5400 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. దీంతో జిల్లా వాసులు పరిశ్రమలు వెల్లువలా వస్తున్నాయని, యువత ఉపాధికి ఊతం దొరుకుతుందని సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక వాడలో ఇప్పటికే పలు సెల్ కంపెనీలు, ఎలక్ట్రానిక్ పరిశ్రమలు కొన్ని ఏర్పాటవుతున్నాయి. 6700 ఎకరాల్లో ఏర్పాటైన ఈ మెగా ఇడస్ట్రియల్ పార్క్ లో రెండు ఎలక్ట్రానిక్ మ్యాను ఫ్యాక్చరింగ్ క్లస్టర్ ఉన్నాయి. వీటిలో ఏర్పాటు చేసేందుకు విశాఖ సమ్మిట్ లో పారిశ్రామిక వేత్తలు ఒప్పందాలు కుదుర్చుకున్నారు.ఒప్పందం ప్రకారం 21 పరిశ్రమలు ఏర్పాటైతే కొప్పర్తి పారిశ్రామిక వాడకు నిండుదనం రావడంతోపాటు రాష్ట్రంలోనే ఎలక్ట్రానిక్ వెలుగులకు కడప జిల్లా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంటుందని ఆశించారు. అందునా ఈ సమ్మిట్ కు దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వివిధ దేశాల రాయబారులు, వారి ప్రతినిధులు హాజరయ్యారు. దీంతో అప్పట్లో ఈ సమ్మిట్ భారీ సక్సెస్ అయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవ్వడంతోపాటు ప్రభుత్వం కూడా సంతృప్తిని వ్యక్తం చేసింది. ఇలాంటి వాతావరణంలో కడప జిల్లాకు 21 పరిశ్రమలు వస్తాయని ప్రకటించడం జిల్లా వాసుల్లో ఆనందాన్ని నింపింది. అయితే నెల రోజులు గడిచినా ఇప్పటికీ స్థితి గతులపై స్పష్టత రాలేదు. దీంతో ఈ పరిశ్రమలు ఏర్పాటు నిజమవుతుందా! కలగా మిగులుతుందా? అన్న సందేహాలకు తావునిస్తోందిగత ప్రభుత్వంలో కూడా పరిశ్రమల ఏర్పాటు కోసం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో సమ్మిట్ నిర్వహించారు. ఈ సమ్మిట్ లో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం ఆయా పరిశ్రమల జాబితా, వాటికి అవసరమైన స్థలాలు, మౌలిక సదుపాయాలపై జిల్లాల్లోని ఏపీఐఐసీ కార్యాలయాలకు సమాచారం పంపారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. పరిశ్రమల స్థాపన ఇప్పటికిప్పుడు చేపట్టలేకపోయినా కనీసం అందుకు సంబంధించిన ప్రాథమిక ప్రక్రియ ప్రారంభం కాకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# తెలంగాణలో ప్రతీకార అరెస్టులు తప్పవా...

**హైదరాబాద్:**

నీ బిడ్డ జైలుకు పోతాది.. నీ కొడుకుకు కూడా జైలు రెడీ చేస్తున్నాము " అని టెన్త్ పేపర్ లీక్ కేసులో అరెస్టయి బెయిల్‌పై విడుదలైన తర్వాత బండి సంజయ్ .. జైలు ముందే సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి హెచ్చరికలు జారీ చేశారు. బండి సంజయ్ అరెస్ట్ తర్వాత బీజేపీ హైకమాండ్ చేసిన ప్రకటనలు.. స్పందించిన విధానం చూస్తే.. ఈ అంశంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని అనుకోవచ్చు. నిజానికి ఇప్పుడు బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఉప్పు, నిప్పులా పరిస్థితి ఉంది. ఇంకా చెప్పాలంటే బీఆర్ఎస్ పార్టీ జుట్టు బీజేపీ చేతుల్లో ఉంది. అయినా బీఆర్ఎస్ రిస్క్ తీసుకుంది. బండి సంజయ్ విషయంలో దూకుడుగా వ్యవహరించింది. అది బీజేపీని రెచ్చగొట్టడమా లేకపోతే వ్యూహాత్మక తప్పిదమా అన్నది ముందు ముందు తెలుస్తుంది. కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రస్తుతం ఢిల్లీ లిక్కర్ స్కాంపై దర్యాప్తు చేస్తున్నరు. కొద్ది రోజులుగా సైలెంట్ అయ్యారు కానీ.. కల్వకుంట్ల కవిత ఇచ్చిన పది ఫోన్లను విశ్లేషిస్తున్నట్లుగా తెలుస్తోంది. మళ్లీ నోటీసులు ఇస్తారా లేదా అన్నది స్పష్టత లేదు. కానీ అరెస్ట్ మాత్రం చేయలేదు. అరెస్ట్ వరకూ వచ్చిందని అందరూ అనుకున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కీలక వ్యక్తులంతా అరెస్టయ్యారు. వారికి బెయిల్ దక్కడం కూడా గగనంగా మారింది. అత్యంత కీలక వ్యక్తిగా ఈడీ, సీబీఐ న్యాయస్థానాలకూ చెబుతూ వస్తున్న కవితను మాత్రం అరెస్టు చేయలేదు. ఆ రెండు దర్యాప్తు సంస్థలు అనుకుంటే ఎప్పుడైనా అరెస్ట్ చేయవచ్చన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో ఉంది. అదే సమయంలో ఫామ్ హౌస్ కేసు కూడా సీబీఐ చేతిలో ఉంది. ప్రస్తుతం సుప్రీంకోర్టు స్టే ఇవ్వలేదు కాదు తదుపరి దర్యాప్తు చేయవద్దని చెప్పింది. ఇవాళ కాకపోతే రేపైనా ఆ కేసు సీబీఐ చేతుల్లోకి వెళ్తుంది. అ కేసులో సాక్ష్యాలు బయట పెట్టిన సీఎం కేసీఆర్‌కూ ఇబ్బందులు తప్పవని న్యాయనిపుణులు అంచనా వేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ బీఆర్ఎస్ నేతలు బండి సంజయ్‌ను టార్గెట్ చేశారు. వరుసగా జరుగుతున్న పేపర్ లీక్‌ల విషయంలో ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను తగ్గించుకునేందుకు బండి సంజయ్‌పై ప్రభుత్వం కుట్ర చేసిందని బీజేపీ అగ్రనాయకత్వ నమ్ముతున్నట్లుగా బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ అరెస్టుపై ప్రధాని మోదీ కూడా వివరాలు తెలుసుకున్నారని అంటున్నారు. బండి సంజయ్ తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత పార్టీ భారీగా పుంజుకుంది. అందుకే ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలకు.. బండి సంజయ్‌పై ప్రత్యేకమైన అభిమానం ఉంది. ఇప్పుడు బండి సంజయ్‌నే అరెస్టు చేశారంటే వారు తేలికగా తీసుకోరని అంటున్నారు. కవిత ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఉన్నారు. ఆమెకు జైలు సిద్ధం చేశామని బండి సంజయ్ గతంలో ప్రకటించారు. కరీంనగర్ జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత బండి సంజయ్.. కేటీఆర్ ప్రస్తావన కూడా తీసుకు వచ్చారు. ఆయనకు కూడా జైలు సిద్ధం చేస్తామన్నారు. కేటీఆర్‌కు సంబంధించి వారి వద్ద ఏమైనా సమాచారం ఉందేమోనన్న అనుమానాలు ఈ ప్రకటనతో ప్రారంభమయ్యాయి. బీజేపీ అగ్రనాయకత్వ ప్రతీకారం తీర్చుకోవాలంటే.. వెంటనే ఏమీ చేసేయదని.. సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకుంటుందని ... ఆ పార్టీ వ్యూహాలపై అవగాహన ఉన్న వారు చెబుతున్నారు. తాము కక్ష సాధింపులకు పాల్పడ్డామని ప్రజలు అనుకోకుండా.. పద్ధతిగా ప్రతీకారం తీర్చుకుంటుందని చెబుతున్నారు. ఈ తరహాలో కేటీఆర్, కవితలను టార్గెట్ చేశారా అన్న సందేహాలు ప్రారంభమవుతున్నాయి. కారణం ఏదైనా బండి సంజయ్ అరెస్ట్ వ్యవహారం టైమింగ్ కరెక్ట్ కాదన్న అభిప్రాయం బీఆర్ఎస్ క్యాడర్‌లో వినిపిస్తోంది. అయితే అన్నీ ఆలోచించే బీఆర్ఎస్ చీఫ్ రాజకీయ వ్యూహాలు అమలు చేస్తున్నారని.. బీజేపీ ట్రాప్‌లో పడుతోందని.. త్వరలోనే అసలు విషయం వెలుగులోకి వస్తుందని కొంత మంది విశ్లేషిస్తున్నారు. ఏదైనా తెలంగాణలో అరెస్టుల రాజకీయాలు డీకోడ్ చేయడం క్లిష్టమే.

# లక్షకు లక్ష ఇస్తానని మోసం

**హైదరాబాద్:**

చాలా మంది అధిక వడ్డీ వస్తుందంటే చాలు ముందు వెనుక ఆలోచించకుండా తాము కష్టపడి దాచుకున్న డబ్బులు తీసుకొచ్చి.. మాయమాటలు చెప్పిన వాళ్ల చేతిలో పెట్టేస్తారు. వాళ్లకు ఆశ చూపించి.. దాన్నే ఆసరాగా చేసుకుని.. వచ్చికాడికి నొక్కేసి ఉడాయిస్తుంటారు. అచ్చం అలాంటి ఘటనే వనస్థలిపురంలో చోటుచేసుకుంది. లక్ష ఇస్తే.. దానికి ఇంకో లక్ష కలిపి ఇస్తా.. అంటూ అమాయక మహిళలను తమ మాటలతో బురిడి కొట్టించి ఓ కిలేడి కోట్లు కొట్టేసిన ఘటన హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో చోటుచేసుకుంది. అధిక వడ్డీ, రియల్ ఎస్టేట్ పేరుతో భారీ మోసానికి పాల్పడ్డ ఒక మహిళపై వనస్థలిపురంలో కేసు నమోదయ్యింది. వనస్థలిపురం పరిధిలో నివాసముంటున్న స్వర్ణలత అనే మహిళ అధిక వడ్డీ, రియల్ ఎస్టేట్ పేరుతో అమాయకమైన జనాలకు మాయమాటలు చెప్పి బుట్టలో వేసుకుంది. లక్షకు లక్ష రూపాయలు ఇస్తానని నమ్మబలికింది. ఆమె మాటలు నిజమని నమ్మిన అమాయకపు జనం ఆమెకు లక్షల్లో డబ్బులు ఇచ్చారు. ఇలా.. స్వర్ణలతకు ఏకంగా 50 మంది మహిళలు డబ్బు ఇవ్వగా.. సుమారు 14 కోట్ల రూపాయల వరకు వసూలైంది. ఇంకేముంది.. కోట్లు కొంగున కట్టేసుకుని.. సైలెంట్‌గా అక్కడి నుంచి ఉడాయించింది. ఈ విషయం తెలుసుకున్న బాధితులు తాము మోసపోయామని గ్రహించి.. గుండెలు బాధుకుంటూ పోలీసులను ఆశ్రయించారు. బాధితు మహిళలంతా కలిసి ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీని ఆశ్రయించి.. తమకు జరిగిన మోసాన్ని వివరించారు. అయితే స్వర్ణలతపై గతంలో వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లోనే ఒక చీటింగ్ కేసు కూడా నమోదు అయినట్లుగా పోలీసులు గుర్తించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్వర్ణలతపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగించారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి..ఎనిమిది మందికి గాయాలు

**నెల్లూరు**

ఉమ్మడి నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం కూలీలతో వెళుతున్న ఆటోను ట్రాలీ వాహనం ఢీ కొట్టింది. ఘటనలో ఒకరు మృతి చెందారు. ఎనిమిది మందికి గాయాలు అయ్యాయి. బాధితులంతా మిరప పంట కోయడానికి నక్కల వారి కండ్రిగ గ్రామం నుంచి నాంచారం పేట వెళుతుండగా ప్రమాదం జరిగింది. మృతురాలు నక్కల వారి కండ్రిగ కు చెందిన కత్తిపోలమ్మ (42). చిల్లకూరు మండలం వరగలి క్రాస్ రోడ్ సమీపంలో జాతీయ రహదారిపై మిరపకోతకు కూలీలతో వెళుతున్న ఆటో రోడ్డు సైడ్ న ఆపి ఉండగా గుర్తు తెలియని ట్రాలీ వాహనం కూలీల ఆటోను ఢీ కొట్టిన ఘటనలో నక్కల వారి కండ్రిగ కు చెందిన కత్తి పోలమ్మ 42 అనే మహిళ ఘటనా స్థలం లోనే మృతిచెందగా మరో ఎనిమిది మంది కూలీలకు కూడా గాయాలయ్యాయి, కూలీలు నక్కల వారి కండ్రిక గ్రామానికి చెందినవారు వారిలో ఒకరు మాత్రం రెట్టపల్లికి చెందినవారు, వీరు మరో ఇద్దరు కూలీల కోసం రోడ్డు పక్కన ఆగి ఉన్న క్రమంలో లారీ ఢీకొట్టినట్టు సమాచారం.. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని చిల్లకూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం..

# డాక్టర్ హర్షవర్ధన్... పుట్టుక, చావుపై సమదృష్టి

**ఖమ్మం:**

వాన రాకడ, ప్రాణ పోకడ తెలియదంటారు. అయితే మృత్యువు కబళిస్తోందని ముందుగానే తెలిస్తే నవనాడులూ కుంగిపోయి, మానసిక వేదనతో కుదేలవుతారు. కానీ ఆ యువకుడు అలా కుంగిపోలేదు. స్వతహాగా డాక్టర్ కావడంతో పుట్టుకను, చావును ఒకే విధంగా చూసే సమదృష్టి అలవడిందేమో.. తాను మరణించిన తర్వాత భార్య ఇబ్బంది పడకూడదని విడాకులు ఇచ్చి, ఆమె జీవితంలో స్థిరపడేందుకు ఏర్పాట్లు చేశాడు. చెట్టంత కొడుకు కళ్లముందే చావుకు దగ్గరవుతుంటే కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులను ఓదార్చి ధైర్యం చెప్పాడు. బంధువులు, సన్నిహితులతో తన చివరి క్షణాలను ఆనందంగా గడిపాడు. తన అంతిమ ఘడియలు సమీపించాయని తెలిసి మృతదేహాన్ని స్వదేశానికి పంపే ఏర్పాటు కూడా చేసుకున్నాడు.కన్నుతెరిస్తే జననం, కన్నుమూస్తే మరణం నడుమ సాగేదే జీవితం. ఎప్పుడో ఒకప్పుడు చనిపోతామని తెలిసి కూడా రేపటి కోసం ఎన్నో ఆశలు పెంచుకుని ప్రణాళికలు రూపొందించుకుని జీవించడమే జీవితం. ఖమ్మం నగరంలోని శ్రీనివాసనగర్ చెందిన ఏపూరి రామారావు, ప్రమీల దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు హర్షవర్ధన్ (33), రెండో కుమారుడు అఖిల్. హర్షవర్ధన్ బి ఫార్మసీ చేసిన తర్వాత ఉన్నత చదువులకు 2013లో ఆస్ట్రేలియా వెళ్లాడు. అక్కడ బ్రిస్బేన్ విశ్వవిద్యాలయంలో హెల్త్ మేనేజ్‌మెంట్, జనరల్ మెడిసిన్ పూర్తి చేశాడు. ఆ తర్వాత క్వీన్స్‌ల్యాండ్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యుడిగా చేరాడు. 20 ఫిబ్రవరి 2020లో ఖమ్మంలో ఘనంగా పెళ్లి చేసుకున్నాడు. వీసా వచ్చిన తర్వాత తీసుకెళ్తానని భార్యకు చెప్పి అదే నెల 29న తిరిగి ఆస్ట్రేలియా వెళ్లిపోయాడు. ఆ తర్వాత అనుకోకుండా అతని జీవితం తలకిందులైంది.అక్టోబరులో వ్యాయామం చేస్తుండగా దగ్గుతోపాటు ఆయాసం రావడంతో హర్షవర్ధన్ పరీక్షలు చేయించుకున్నాడు. రిపోర్ట్సులో గుండె బద్దలయ్యే నిజం బయటపడింది. తనకు ఊపిరితిత్తుల క్యాన్సర్ సోకినట్టు తేలింది. విషయం తెలిసిన తల్లిదండ్రులు ఇంటికి వచ్చేయన్నారు. వారికి ధైర్యం చెప్పిన హర్షవర్ధన్ ఆస్ట్రేలియాలోనే మంచి చికిత్స లభిస్తుందని, మీరేం కంగారు పడకండి అని వారికి నచ్చజెప్పాడు. బతకడానికి ప్రయత్నించాడు ..మెరుగైన ట్రీట్మెంట్ తీసుకున్నాడు. .ఆస్ట్రేలియాలో అద్భుతమైన అధునాత వైద్యం అందినప్పటికీ ప్రయోజనం లేదు. అందువల్ల తన శరీరాన్ని ఆవహించిన క్యాన్సర్ భూతం ఎలా కబళిస్తుందో అంచనా వేయగలిగాడు. ఇంకా ఎన్నిరోజులు బతుకుతానో అంచనా వేసుకున్నాడు.తనకు సోకిన కేన్సర్ నయమయ్యే పరిస్థితి లేదని, చనిపోవడం ఖాయమని తెలుసుకున్న హర్షవర్ధన్ కట్టుకున్న భార్యని విడాకులు ఇచ్చి ఇంకో పెళ్లి చేసుకోమన్నాడు. పెళ్లై అంతా కలిపి పదిరోజులు కూడా కాపురం ేయలేదు. అందుకే తన వల్ల ఆమె జీవితం నాశనం కాకూడదని ఆలోచించాడు.. ఆమెకి తన జబ్బు గురించి వివరించాడు. ఆపై జీవితంలో ఆమె స్థిరపడేందుకు ఏర్పాట్లు చేశాడు. కేన్సర్‌కు చికిత్స తీసుకుంటున్న హర్షవర్ధన్‌కు ఆ తర్వాత జరిపిన పరీక్షల్లో వ్యాధి నయమైనట్టు డాక్టర్లు చెప్పారు. దీంతో ఎంతో ఆనందంగా గతేడాది సెప్టెంబరులో ఖమ్మం వచ్చి 15 రోజులు గడిపి వెళ్లాడు. అయితే, ఆ తర్వాత వ్యాధి మళ్లీ తిరగబెట్టింది. ఈసారి మాత్రం అది చికిత్సకు



లొంగలేదు. ఇక మిగిలింది కొన్ని రోజులేనని డాక్టర్లు తేల్చేశారు. అయినా హర్షవర్ధన్ ఎలాంటి ఆందోళన చెందలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. తల్లిదండ్రులు జీవితమంతా సుఖంగా బతికేలా ఏర్పాట్లు చేశాడు. ఆఖరికి తాను చనిపోయాక ఆస్ట్రేలియా నుంచి తన మృతదేహాన్ని తీసుకెళ్లడానికి కూడా తల్లిదండ్రులు ఎలాంటి ఇబ్బందీ పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాడు. ఆరోగ్యం క్షీణిస్తుండడంతో తరచూ బంధువులకు వీడియో కాల్ చేసి మాట్లాడేవాడు. స్నేహితులను ఇంటికి పిలిపించుకుని కబుర్లు చెప్పేవాడు. ఈ క్రమంలో విష్ణువర్ధన్ మృతి చెందాడు. ముందుగా ఏర్పాట్లు చేసుకోవడంతో ఖమ్మంలోని హర్షవర్ధన్ ఇంటికి అతని మృతదేహం చేరుకుంది. బంధుమిత్రుల అశ్రు నయనాల మధ్య అంత్యక్రియలు ముగిశాయి

ప్రజా తపన
prajathapana.com
News that matters

## వివాహిత ఆత్మహత్య

**రంగారెడ్డి**

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లో విషాద ఘటన జరిగింది. నందినీ అనే వివాహిత ఆత్మహత్య చేసుకోంది. గది లో ఫ్యాన్ కు ఉరి వేసుకొని బలవన్మరణం పొందింది. అదనపు కట్నం కోసం భర్త, అత్తమామల వేధింపులు భరించలేక నందిని తనువు చాలించింది. తమ బిడ్డను చిత్ర హింసలు పెట్టి భర్త, అత్తమామలు హత్య చేసి, ఆత్మహత్య గా చిత్రీకరించారంటూ నందినీ పేరెంట్స్ ఆరోనించారు. మృతురాలి ఒంటి పై గాయాలు ఉన్నాయి. అతి దారుణంగా నా బిడ్డను కొట్టి చంపేసారు. గత కొన్న రోజులుగా అదనపు కట్నం తేవాలని చిత్రహింసలు పెడుతున్నారు. నీ బిడ్డ చనిపోయింది వచ్చి శవాన్ని తీసుకొని వెళ్లండంటూ వారికి భర్త ఫోన్ చేసాడని అన్నారు. నందినీ స్వస్థలం కర్ణాటక లోని బీదర్ జిల్లా. విషయం తెలియగానే హుటాహుటిన హైదరాబాద్ కు వచ్చిన తల్లిదండ్రులు, రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. భర్త రత్నదీప్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అత్తమామ విజయ, లక్ష్మన్ రావు పరారీలో వున్నారు.

## పీఎం సభలో సిఎంకు కుర్చీ ఏర్పాటు

**సికింద్రాబాద్**

పరేడ్ గ్రౌండ్ వేదికపై ప్రధాని మోడీ, అశ్విని వైష్ణవ్, కిషన్ రెడ్డి లతో పాటు సిఎం కేసీఆర్, మంత్రులు మహమూద్ అలీ, తలసాని, ప్రశాంత్ రెడ్డి, హరీశ్ రావు కు కుర్చీల ఏర్పాటు చేయడం విశేషం. స్థానిక ఎంపీ రేవంత్ రెడ్డి కి కుడా అధికారులు కుర్చీ ఏర్పాటు చేసారు. వెనకాల ఎంప్టీ చైర్స్ ఏర్పాటు చేసారు.

## నిత్య అన్నదానంలో సిబ్బంది చేతివాటం

**చిత్తూరు**

కాణిపాకం దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదానం లో పనిచేస్తున్న సిబ్బంది చేతివాటం చూపించడం చర్చానీయాంశమయింది. పలువురు సిబ్బంది అన్నదానం లో నిత్యావసర వస్తువుల దొంగతనాలకు పాల్పడినట్టు సమాచారం. ఈ నేపధ్యంలో కార్యనిర్వహణ అధికారి వెంకటేష్, ఇతర ఆలయ అధికారులు అనుమానిత సిబ్బంది ఇళ్లల్లో తనిఖీ లు జరిపారు. భారీగా సామాగ్రి స్వాధీనం చేసుకున్నాడు. మరికొంతమంది సిబ్బంది ఇండ్లలో ఆలయ అధికారులు తనిఖీ లు చేసారు. నిత్య అన్నదానంలోని ఇద్దరు ప్రధాన కుక్కులు, వాళ్లకి ఇద్దరు సహాయకులు ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించగా సుమారు 25 బస్తాల బియ్యము( ఒక్కొక్క బస్తా 25 కేజీలు), రెండు బస్తాల కందిపప్పు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

## సంచలనంగా సీఎంఆర్ఎఫ్ గోల్ మాల్

**నల్లగొండ**

నల్గొండ జిల్లా లో సీఎంఆర్ఎఫ్ గోల్ మాల్ సంచలనం రేపింది. మిర్యాలగూడలో నకిలీ మెడికల్ బిల్లులు పెట్టి సీఎం సహాయనిధి స్వాహా చేసిన వైనం బయటపడింది. మిర్యాలగూడ లోని డాక్టర్స్ కాలనీలో ఉన్న మహేష్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి పాత్ర ఉందని సీసీఎస్ పోలీసులు గుర్తించారు. ముగ్గురి పేర్లతో రూ. 4.55 లక్షలు అసుపత్రి యజమాన్యం కాజేసినట్లు నిర్ధారించారు. నరేష్, లక్ష్మీ, జ్యోతి పేరుతో సీఎంఆర్ఎఫ్ విడుదల అయింది. బిల్లుల తనిఖీ సమయంలో అనుమానంతో విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నాలుగేళ్లలో మూడు పేర్లను మహేష్ ఆస్పత్రి యాజమాన్యం మార్చింది.

## బేడిలతో నిందితుడు పరారీ

**విశాఖపట్నం**

విశాఖపట్నం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి గంజాయి కేసులో నిందితుడు. బేడిలతో పరారైయాడు. నిందితుడు చోడవరం కు చెందిన సత్తిబాబు. బహిర్భూమికి వెళ్తానని చెప్పి పోలీసులకు కళ్ళు కప్పి పరారీ అయ్యాడు. బేడిలతో సహ సత్తిబాబు కనిపించడంతో కొంతమంది పట్టుకునేందుకు ప్రయత్నించారు. వారిని సైతం తప్పించుకుని పరారైయాడు. బస్ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ ల్లలో నిందితుడు కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

## కడప నగరంలో ఉద్రిక్తత

## వామపక్ష నేతలను అడ్డుకున్న పోలీసులు

**కడప**

కడపలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఇతర వామపక్ష నాయకులను పోలీసులు అరెస్ట్ చేసారు. శుక్రవారం నాడు కర్నూలులో డాక్టర్ అచ్చన్న కుటుంబ సభ్యులను పరామర్శించిని వామపక్ష నేతలు శనివారం కడపకు చేరుకున్నారు. పశుసంవర్దకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చన్న మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని.. వామపక్షాలు, దళిత సంఘాలు కడపలో భారీ ర్యాలీకి పిలుపునిచ్చారు. ర్యాలీ, నిరసనకు పిలుపుతో కడపలోని ఓ హోటలులో బసచేసిన సీపీఐ రామకృష్ణను, ఇతర పార్టీ నేతలను అరెస్ట్ చేసేందుకు పోలీసులు పెద్ద ఎత్తున వచ్చారు. మరోవైపు రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి హౌస్ అరెస్ట్ అయ్యారు. ఎవ్వరు అడ్డుకున్నా ర్యాలీ నిర్వహించి తీరుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు.

# 45 రోజుల షెడ్యూల్ తో బీఆర్ఎస్

**హైదరాబాద్:**

ష్ట్ర శాసనసభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో ప్రభుత్వ, పార్టీ కార్యకలాపాలను ముమ్మరం చేయడంపై బీఆర్ఎస్ దృష్టి సారించింది. వరుసగా సభలు, సమావేశాలు నిర్వహించడంతో పాటు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించింది. ఈ నెల 14న జరిగే భారీ అంబేద్కర్ విగ్రహావిష్కరణ మొదలుకుని.. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వరకు వరుసగా సభలు, సమావేశాల నిర్వహణకు షెడ్యూల్ సిద్ధం చేసింది. ఈ నెల 14న హుస్సేన్‌సాగర్ తీరంలో జరిగే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పార్టీలకు అతీతంగా నిర్వహించా లని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. అంబేద్కర్ మన వడు ప్రకాశ్ అంబేద్కర్‌ను ఆహ్వానించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా నిర్వహించే సభకు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 300 మంది చొప్పున 35,700మంది పాల్గొనేలా ప్రణాళిక సిద్ధం చేసిందిఈ నెల 30న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కార్యక్రమంలో సీఎం, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్, గ్రంథాలయ సంస్థల చైర్‌పర్సన్లు, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్లు, ఇతరులు కలుపుకొని 2,500 మంది వరకు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. రెండేళ్లుగా హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ప్లీనరీని ఈ ఏడాది ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ ప్లీనరీ సందర్భంగా ప్రతినిధుల సభ నిర్వహించనున్నారు.టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా పేరు మారిన తర్వాత జరుగుతున్న తొలి ప్లీనరీ ఇది. ఈ క్రమంలో జాతీయ పార్టీగా అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులను ఆహ్వానించే అవకాశం ఉంది. సుమారు 8 వేల మంది ప్రతినిధులు ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ ప్లీనరీకి హాజరవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో స్థానిక నేతలు పార్టీ జెండాలను ఆవిష్కరిస్తారు.ఎన్నికల సన్నద్ధతలో భాగంగా క్షేత్రస్థాయిలో చేపట్టిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలను మే నెలలోనూ కొనసాగించాలని పార్టీ అధినేత కేసీఆర్ సూచించారు. ఆత్మీయ సమ్మేళనాలకు కేడర్ నుంచి వస్తున్న స్పందనను దృష్టిలో పెట్టుకుని విస్తృతంగా నిర్వహించేందుకు మాజీ స్పీకర్ మధుసూదనాచారి నేతృత్వంలో పది మందితో కూడిన పర్యవేక్షక కమిటీని ఏర్పాటు చేశారు. అంటే మరో నెలన్నర పాటు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు కొనసాగనున్నాయి. ఇక జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సచివాలయం ఎదురుగా నిర్మించిన అమరుల స్మారకాన్ని ప్రారంభించనున్నారు.

# చేరికల కోసం ఎదురు చూపులు

**హైదరాబాద్:**

ఎన్నికల ఏడాది కావడంతో పార్టీలు చేరికలపై దృష్టి సారించాయి. గతంలో మునుగోడు ఉప ఎన్నిక సమయంలో మందగించిన చేరికల పర్వం తాజాగా మరోసారి ఊపందుకుంటోంది. కలిసి వచ్చే నేతల కోసం ప్రధాన పార్టీలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. ఈ క్రమంలో బీజేపీలోకి నేతలు వరుసగా వచ్చి చేరుతున్నారు. తాజాగా టీజేఎస్ ను వీడిన వెంకట్ రెడ్డి, దివంగత హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి కుమారుడు ఇంద్రసేనా రెడ్డి, మహిళా పారిశ్రామిక వేత్త జుటూర్ కీర్తిరెడ్డి, అదం విజయ్ కుమార్ లు శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. మరో వైపు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా పని చేసిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో ఇవాళే కాషాయ కండువా కప్పుకున్నారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో బీజేపీలోకి చేరికల పర్వం ఆసక్తిని పెంచుతుంది. అయితే ఓ వైపు బీజేపీ, కాంగ్రెస్ గట్టి పోటీ ఇస్తున్న సమయంలో రాష్ట్రంలోని నేతలన తమ వైపు తిప్పుకోవాల్సిన కేసీఆర్ మాత్రం ఇక్కడి నేతలను వదిలేసి పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల నేతలకు కండువాలు కప్పడంలో బిజీగా ఉంటున్నారు. ఇటీవల మహారాష్ట్రకు చెందిన పలువురు రైతు సంఘాల నాయకులను బీఆర్ఎస్ లో చేర్చుకున్నారు. దీంతో తెలంగాణను వదిలేసి పొరుగు రాష్ట్రాల నేతలపై పోకస్ పెట్టడం వల్ల అసలుకే ఎసరు రాదా అనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయిమరోవైపు గతంలో చేరికలతో సందడిగా మారిన గాంధీ భవన్ లో ప్రస్తుతం అటువంటి కార్యక్రమాలేవి జరగడం లేదు. రేవంత్ వర్గం వర్సెస్ సీనియర్ల విబేధాల కారణంగా చేరికలకు బ్రేక్ పడిందనే చర్చ హస్తం పార్టీలో వినిపిస్తోంది. గతంలో టీడీపీలో పని చేసిన వారినందరిని రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకుంటున్నారని ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్ లో టీ కాంగ్రెస్ కాస్తా టీటీడీపీకి మరో సెంటర్ గా మారుతుందనే విమర్శలు వినిపించాయి. ఈ క్రమంలో చెప్పుకునే నేతలెవరూ కాంగ్రెస్ లో ఇటీవల చేరలేదు. ఇదే సమయంలో తెలంగాణలో తిరిగి పునరుత్తేజం కావాలని చూస్తున్న టీటీడీపీ సైతం చేరికలపై దృష్టి సారించింది. గతంలో టీడీపీ తరపున ఎమ్మెల్యేకు పోటీ చేసి అనంతరం బీఆర్ఎస్ లో చేరిన కూన వెంకటేష్ గౌడ్ గులాబీ పార్టీకి షాకిచ్చారు. పార్టీలో సరైన గుర్తింపు లేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ కు రాజీనామా చేశారు. త్వరలో టీడీపీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. దీంతో రాబోయో రోజుల్లో పార్టీల మధ్య చేరికలు ఏ మేరకు స్పీడందుకోబోతున్నాయనే చర్చ పొలిటికల్ సర్కిల్స్ లో చక్కర్లు కొడుతోంది

# నేతలు... ఒక్కటవుతున్నారు

**నల్గొండ :**

నల్గొండ జిల్లా. తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గం.. జిల్లాకు చెందిన ఇద్దరు రెడ్డి సామాజిక వర్గం కాంగ్రెస్ నేతలు పట్టు బిగించిన రిజర్వ్‌డ్ సెగ్మెంట్ ఇది. ఇక్కడ కాంగ్రెస్ టిక్కెట్ రావాలన్నా అభ్యర్థి గెలవాలన్నా వాళ్ళిద్దరి ఆశీస్సులు తప్పకుండా ఉండాల్సిందేనట. నిన్న మొన్నటిదాకా ఉప్పు నిప్పులా ఉన్న ఆ ఇద్దర్ని ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వడగళ్ళ వానలు కలిపాయట. ఆ ఇద్దరే భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి.చాలా కాలం తర్వాత వెంకటరెడ్డి, దామోదర్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఒకే వేదిక మీదికి వచ్చి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. వడగళ్ళ వాన బాధితుల్ని ఆదుకోవడంలో తెలంగాణ సర్కార్ విఫలమైందంటూ ఏక స్వరం వినిపిస్తున్నారు ఇద్దరూ. ఇన్నాళ్ళు ఉప్పు నిప్పులా ఉన్న నాయకులు ఎన్నికలు సమీపిస్తున్న టైంలో ఒక్కటవడం తుంగతుర్తిలో హాట్ టాపిక్ అయింది. ఇద్దరికీ ఈ నియోజకవర్గం మీద పట్టున్నందున ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిని కలిసి డిసైడ్ చేస్తారా లేక వేరెవరైనా చెయ్యి వేస్తారా అన్న చర్చ జోరందుకుంది. ఈ కలయిక స్థానిక కాంగ్రెస్ అభ్యర్థిగా రేసులో ఉన్న సీనియర్ లీడర్ అద్దంకి దయాకర్‌కి చెమటలు పట్టిస్తోందట. ఇద్దరూ ఒక మాట మీదికి వస్తే.. ఈసారి దయాకర్‌కు టిక్కెట్ దక్కదేమోనన్న డౌట్స్ వస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. ఇందుకు కారణాలు కూడా బలంగానే ఉన్నాయట.2014, 2018 ఎన్నికలలో కాంగ్రెస్ తరపున పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయిన అద్దంకి దయాకర్ మరోసారి అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు. అయితే ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. కొద్ది నెలల క్రితం ఓ వేదిక నుంచి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీద అద్దంకి దయాకర్ చేసిన కామెంట్స్ కాంగ్రెస్ పార్టీలో పెద్ద రచ్చకు దారితీశాయి. మరో నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి మీద గతంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు అద్దంకి దయాకర్. దీంతో ఇప్పుడు ఇద్దరూ కలిసి ఏం డిసైడ్ చేస్తారోనన్న టెన్షన్ దయాకర్ అనుచరుల్లో పెరుగుతోందట. ఓడిపోయిన రెండు సార్లు తనకు దామోదర్ రెడ్డి సహకరించకపోవడం వల్లేనని దయాకర్ చెప్పడం, ఆ మాటలను మాజీ మంత్రి ఖండించడం జరిగాయి. ఆ వ్యాఖ్యలను తనకు అనుకూలంగా మలుచుకుని తన బలంగా ప్రొజెక్ట్ చేసుకున్నారు రాంరెడ్డి దామోదర్ రెడ్డి. అదే సమయంలో ఎంపీగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట కూడా కీలకం కావడంతో. ఆ ఇద్దరి ఆశీస్సులు ఉంటేనే తుంగతుర్తిలో సీటు వచ్చేదైనా, కాంగ్రెస్ అభ్యర్థి గెలిచేదైనా అన్న ప్రచారం జోరుగా జరుగుతోంది. దీంతో ఆశావహులంతా హైదరాబాద్‌లోని ఆ ఇద్దరి ఇళ్ళకు క్యూ కడుతున్నారట.క్యాడర్ బలంగా ఉన్నా లీడర్ స్థానికంగా అందుబాటులో ఉండకపోవడం పోటీలో ఉండే అభ్యర్థి స్థానికేతరుడు కావడం వల్లే గత రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిందన్న అభిప్రాయం సైతం ఉంది. 2018లో టికెట్ ఆశించి భంగపడి ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగి.. సస్పెండ్ అయ్యారు వడ్డేపల్లి రవి. కొన్నాళ్ళ తర్వాత కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమక్షంలో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారాయన. అయితే రవి మీద పార్టీ ఆరేళ్ళ పాటు వేటు వేసింది. ఇంకా సస్పెన్షన్ ఎత్తేయలేదు. ఇప్పుడు ఆయనతో పాటు రాష్ట్ర పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రీతం, మరికొందరు నేతలు రేసులో ఉన్నారు. అంతా ఎవరి స్థాయిలో వారు ఆ ఇద్దర్నీ ప్రసన్నం చేసుకునే పనిలో బిజీగా ఉన్నారట. ఇన్నాళ్ళు ఎంపీ, మాజీ మంత్రికి పడకపోవడంతో ఒకరు అవునంటే.. మరొకరు కాదంటారేమోనన్న టెన్షన్ ఈ ఆశావహుల్లో ఉండేదట.కానీ తాజాగా ఇద్దరు నేతలు ఒకే వేదికపై కనిపించడంతో? ఆ టెన్షన్ తప్పిందని తెగ సంబరపడిపోతున్నారట ఆశావహులు. వాళ్లిద్దరూ కలిసి ఒక మాట అనుకుంటే ఇక తుంగతుర్తిలో తిరుగే ఉండదని అనుకుంటున్నారు కాంగ్రెస్ టిక్కెట్ రేసులో ఉన్న నాయకులు. ఇద్దరితో ఇక్కట్లు లేకుంటే ఎవరికి టిక్కెట్ ఇచ్చినా గెలిచేస్తామన్న ఆనందంలో ఉన్నారట. అయితే ఇప్పుడు ఉన్నది ఒకటే క్వశ్చన్. ఈసారి కాంగ్రెస్ టిక్కెట్ విషయంలో ఇద్దరూ ఏకాభిప్రాయంతో ఇప్పుడున్న ఆశావహుల్లో ఒకరిని ఎంపిక చేస్తారా? లేక కొత్తగా ఎవరినైనా ప్రతిపాదిస్తారా అన్నది తేలాలి. అదే జరిగితే అద్దంకి దయాకర్ పరిస్థితి ఏంటి రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన వ్యక్తి కాబట్టి ఆయనకు ఎంతో కొంత కేడర్ ఉంటుంది. ఆ కేడర్ కొత్త అభ్యర్థికి ఎంత వరకు సహకరిస్తుందో తేలాలి. మొత్తంగా చూస్తే ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంలో ఫలితాన్ని ఇద్దరు ఓసీ నేతలు డిసైడ్ చేయడం కొసమెరుపు.

## కోళ్ల ఫారం దగ్ధం.

### బాధితులను పరామర్శించిన ఉప ముఖ్యమంత్రి

**ఏలూరు**



పశ్చిమ గోదావరి జిల్లాలోని దేవరాపల్లి మండలంలోని ఏ.కొత్తపల్లి గ్రామానికి చెందిన కోళ్ల ఫారం రైతు గోకాడ ప్రసాద్ కోళ్ల షెడ్డు నిన్న మధ్యాహ్నం సమయంలో అగ్నిప్రమాదనికి గురై పూర్తి దగ్ధమైంది. ఈ ఘటనలో 10 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిలిందని సదరు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారిని ఓదార్చారు.

## జాలర్ల ఘర్షణ..ఉద్రిక్తత

**నెల్లూరు**

నెల్లూరు జిల్లా అల్లూరు మండలం ఇసుకపల్లి సముద్ర తీరంలో ఆంధ్రా,తమిళనాడు మత్స్యకారులు మద్య ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఆంధ్ర తీర ప్రాంతంలోకి తమిళనాడు కడలూరు బోట్లు ప్రవేశించాయి. కడలూరు బోట్ తగిలి ఇసుకపల్లి మత్స్యకారుల వలలు తెగిపోవడంతో వివాదం చెలరేగింది. ప్రశ్నించిన ఇసుకపల్లి జాలర్ల పై తమిళనాడు జాలర్లు రాళ్ల దాడికి దిగారు. తమిళనాడు జాలర్ల రాళ్ల దాడిలో ఇసుకపల్లి మత్స్యకారులు గాయపడ్డారు తమిళనాడు జాలర్లపై ప్రతి దాడి చేసేందుకు ఇసుకపల్లి జాలర్లు గాజు సీసాలు రాళ్లు తీసుకొని సముద్రంలోకి వెళ్లారు. ఏ క్షణం ఏం జరుగుతుందో అంటూ ఉద్రిక్త పరిస్థితుల్లో ఇసుకపల్లి సముద్ర తీరం వుంది. సముద్ర తీరంలో ఉద్రిక్తత దృష్ట్యా ఇసుకపల్లి కోస్ట్ గార్డ్ పోలీస్ అప్రమత్తమయింది. .

## మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

**భువనగిరి**

యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్ భవనాల నిర్మాణం కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ గా ఎయిమ్స్ భవనంలకు శంకుస్థాపన చేసిన నేపధ్యంలో బిజెపి రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణ రెడ్డి కార్యకర్తలతో కలిసి మోడీ చిర్ర పటానికి పాలాభిషేకంచేశారు..ఈ సందర్భంగా గూడూరు నారాయణ రెడ్డి మాట్లాడుతూ పేదలకు అందుబాటులో ఉండే విధంగా తక్కువ ఖర్చుతో వైద్యాన్ని అందించే దిశగా నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. ఎయిమ్స్ అభివృద్ధి కోసం 1366కోట్ల రూపాయలను మంజూరు చేసి నిర్మాణ పనులను త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తి చేసుకొని రాబోయే సంవత్సరం ఏప్రిల్ లో 750 పడకలతో సూపర్ స్పెషలిటీ ఆసుపత్రిగా ప్రారంభించనున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు.

## సింగరేణిని ప్రైవేటీకరణ చేయవద్దు

**హైదరాబాద్**

తెలంగాణలో సింగరేణి బొగ్గు గణుల ప్రైవేటీకరణ ను వ్యతిరేకిస్తూ.... హైదరాబాద్ లకడీకాపూల్ సింగరేణి భవన్ వద్ద గో బ్యాక్ మోడీ అంటూ బీఆర్ఎస్కేవీ బీఆర్ఎస్ కార్మిక విభాగం, బీఆర్టీయూ సంఘం నేతలు నిరసనలకు దిగారు.

బీఆర్టీయూ అధ్యక్షుడు రాంబాబు యాదవ్ మాట్లాడుతూ లాభాల బాటలో ఉన్న సింగరేణి ప్రైవేటీకరణ చేయడం కేంద్ర ప్రభుత్వపు దుర్మార్గపు చర్య. సింగరేణి ప్రైవేటీకరణతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. తెలంగాణ కు తీవ్ర అన్యాయం జరుగుతుంది. విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. సింగరేణిలో బోనస్ లు, రిజర్వేషన్లు, కారుణ్య నియామకాలు, రిజర్వేషన్లు, బొగ్గు ఉత్పత్తి అన్నింటికి అంతరాయం ఏర్పడుతుంది. బొగ్గు గనుల ప్రైవేటీకరణ ను అడ్డుకుని తీరుతామని అన్నారు.

## పార్టీ నేతలతో రేవంత్ ప్రత్యేక సమావేశం

**హైదరాబాద్**



గాంధీభవన్ లో పలువురు ఉపాధ్య క్షులు, ప్రధాన కార్య దర్శులతో ఏఐసీసీ ఇంచార్జ్ మాణిక్ రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి., వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరీ, నదీమ్ జావిద్ తదితరులు శనివారం ప్రత్యేకంగా సమావేశమైయారు.

రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే 8 నెలల పాటు అవిశ్రాంత పని చేయాలి. ఇది చాలా కీలకమైన సమయం. నాయకులు, వారికి కేటాయించిన బాధ్యతలను పకడ్బందీగా పని చేయాలి. ప్రసార మాధ్యమాలలో మన వాదన బలంగా వినిపించేందుకు ప్రతి నాయకుడు సిద్ధంగా ఉండాలి. బీజేపీ, బిఆర్ ఎస్ పార్టీ లు ఎవరు ఎవరి కోసం పని చేస్తున్నారో ప్రజలకు వివరించాలి. పని విభజన చేసాము.. ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడం చాలా కీలకమని అన్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# రెండు ప్రతిపక్ష పార్టీల నిరుద్యోగ చిచ్చు

**ఖమ్మం:**

తెలంగాణలో నిరుద్యోగ సమస్య రెండు ప్రతిపక్ష పార్టీల మధ్య చిచ్చు పెట్టింది. అప్పటి వరకు రాజకీయ వైరుధ్యం కాని, వ్యక్తిగత వైరం కానీ లేని ఆ పార్టీల నేతలు ఒకే ఒక్క సంఘటనతో బద్ధ శత్రువులుగా మరారు. పరస్పర విమర్శలు చేసుకున్నారు. తెలంగాణలో నిరుద్యోగ సమస్య పై ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి పోరాడాలని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఇటీవల పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులకు స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారామె. నిరుద్యోగ సమస్య పై పోరాటంలో రాష్ట్రంలోని ప్రతిపక్షాలన్నీ తనతో కలిసి రావాలని బహిరంగ లేఖలు రాశారు. అనంతరం టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులను వారి కార్యాలయాల్లో కలిసి చర్చించారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రతిపక్షాలకు మనుగడ లేకుండా చేసేందుకు తెలంగాణ సర్కార్ పోలీసులను ప్రయోగిస్తోందని, కేసీఆర్ ను అడ్డుకోవాలంటే టి సేవ్ వేదికగా ప్రతిపక్షాలు ఒక్కటై తీరాలని అన్నారు షర్మిల. ఆమె విపక్ష నేతల్ని కలిసిన సందర్భంలోనే కొత్త వివాదం ఒకటి తెరమీదికి వచ్చింది.ప్రతిపక్షాలు అధికార పక్షాన్ని, అధికార పక్షం ప్రతిపక్షాలను విమర్శించడం సాధారణం. ప్రతిపక్ష పార్టీలు కూడా సిద్ధాంత వైరుధ్యాల కారణంగా ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటారు. కానీ ఒక రాజకీయ పార్టీ ఆఫీస్‌కి వెళ్ళి నేరుగా అక్కడే? ఆ పార్టీ పెద్దనే విమర్శించడం.. అదే పెద్దతో తిరిగి తిట్టించు కోవడం మాత్రం ఎక్కడా జరగదు. కానీ? ఈ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు షర్మిల.సీపీఎం ఆఫీస్‌కు వెళ్ళి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శినే విమర్శించి వచ్చారు. దాని మీదే ఇప్పుడు రాజకీయ దుమారం రేగుతోంది. వేళ్ళ మీద లెక్కపెట్టేంత రాజకీయ అనుభవం కూడా లేని వారు దశాబ్దాల అనుభవం ఉన్న వారిని విమర్శించడం వారి రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం అని దుమ్మెత్తి పోస్తున్నారట లెఫ్ట్ నేతలు. పార్టీ కార్యాలయానికి వెళ్ళి? వచ్చిన విషయం, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల మీద మాట్లాడకుండా విధానాలను వేలెత్తి చూపడం ఏంటని మిగతా రాజకీయ పార్టీలు కూడా ప్రశ్నిస్తున్నాయి. వైఎస్సార్ టీపీ వ్యవహార శైలి గురువింద గింజ సామెతను గుర్తు చేస్తోందంటున్నాయి.కానీ షర్మిల సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో వాగ్వాదానికి దిగడం వెనుక అసలు కారణం వేరే ఉందట. రాబోయే ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని వైఎస్ షర్మిల తన పాదయాత్ర సందర్భంగా ప్రకటించారు. అంతకు ముందు పలు సభల్లో అదే మాట చెప్పారు. పాలేరు నియోజకవర్గంలో పార్టీ క్యాంపు కార్యాలయాన్ని కూడా నిర్మించుకుంటున్నారామె. అయితే తాజాగా వామపక్షాలు రాబోయే ఎన్నికల్లో ఎక్కడెక్కడ పోటీ చేస్తాయో చెప్పే ప్రయత్నం చేస్తున్నాయి. సీపీఐ కొత్తగూడెం స్థానంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో, సీపీఎం పాలేరుతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. కాలానుగుణంగా బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకోవాలా? లేదా? అనే అంశాన్ని పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు పార్టీ అగ్ర నాయకులు. కాగా పాలేరు నియోజకవర్గంలో తమ్మినేని వీరభద్రంకు గట్టి పట్టుంది. ఒకవేళ బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుని ఎన్నికలకు వెళ్తే తమ్మినేని విజయం సాధించడం ఖాయమన్నది లోకల్ టాక్. అయితే పాలేరు నుంచే షర్మిల కూడా పోటీ చేయనున్నట్లు ముందే ప్రకటించడంతో ఇద్దరు ప్రత్యర్థులుగా భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.ఎన్నికల కంటే ముందే సీపీఎంను ప్రజల ముందు ఎండగట్టాలని భావిస్తున్నారట షర్మిల. అందుకే కలిసి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మీడియా ముందే సీపీఎం వైఖరిని తప్పుపట్టారట. ఈ సంఘటనతో షర్మిల దుందుడుకు స్వభావం, కమ్యూనిస్టు పార్టీల విషయంలో అవగాహనా రాహిత్యం, అధికార పార్టీ మీద ఏహ్య భావం మాత్రమే కనిపించాయి కానీ.. రాజకీయ పరిపక్వత కనిపించలేదంటున్నారట పరిశీలకులు. ఆమెలో ప్రతిపక్ష పార్టీలతో కలిసి పోరాటాలు చేసే మనస్తత్వం కనిపించ లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సంఘటనతో పాలేరు నియోజకవర్గంలో ప్రత్యర్థులుగా తమ్మినేని, షర్మిల కనిపిస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

# లవర్ కోసం పేపర్ కొనుగోలు

**హైదరాబాద్:**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల పేపర్ లీకేజీ కేసులో సిట్ పోలీసులు మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీరు డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పేపర్ ను ప్రధాన నిందితుడయిన శ్రావణ్ వద్ద కొనుగోలు చేశారు. అరెస్టయిన వారిని సాయి లౌకిక్, సుష్మగా గుర్తించారు. వీరిద్దరూ ప్రేమికులు. సుష్మ కోసం సాయి లౌకిక్ ఆరు లక్షల రూపాయలు శ్రావణ్‌కు చెల్లించి మరీ ప్రశ్నాపత్రాన్ని కొనుగోలు చేశారు. శ్రావణ్‌కు బ్యాంక్ ఖాతా ద్వారా నగదు చెల్లించారు. సిట్ పరిశోధనలో శ్రావణ్ బ్యాంకు ఖాతాలను పరిశీలించడంతో ఇలా పెద్ద మొత్తంలో నగదు జమ అయిన విషయాన్ని గుర్తించారు. ఎవరు జమ చేశారో ఆరా తీసి వారిని ప్రశ్నించడంతో అసలు గుట్టు బయట పడింది. పేపర్ కొనుగోలు చేసినందున వీరిద్దర్నీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటి వరకూ ఖాఖాఅ పేపర్ లీక్ కేసులో అరెస్ట్ అయిన వారి సంఖ్య 17కు చేరింది. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌పై టెక్నికల్ సాక్ష్యాల కోసం సిట్ అధికారులు ఇప్పటికే ఎఫ్ఎస్ఎల్ విశ్లేషణ చేయించారు. ఆ నివేదిక కూడా పోలీసులకు అందింది. ప్రవీణ్, రాజశేఖర్, రేణుక నుంచి సీజ్ చేసిన సెల్‌ఫోన్లను ఎఫ్ఎస్ఎల్ తో విశ్లేషణ చేయించారు. టీఎస్‌పీఎస్సీ ఆఫీసులోని ప్రవీణ్, రాజశేఖర్ లాప్టాప్, సిస్టమ్స్‌ను ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు. ఈ నివేదిక రావడంతో 90 శాతం విచారణను సిట్ పూర్తి చేసినట్లయింది. ఎఫ్ఎస్ఎల్ రిపోర్టును కోర్టుకు సిట్ అందించనుంది. విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐ ప్రశాంత్‌కు మరోసారి సిట్ నోటీసులు ఇవ్వనుంది. 150 మందికిపైగా వ్యక్తులను సిట్ ఇప్పటివరకు విచారించింది. టీఎస్‌పీఎస్సీ ఛైర్మెన్, సెక్రెటరీ, మెంబర్, 15 మంది నిందితులు, గ్రూప్-1 అభ్యర్థులను సిట్ విచారించింది. ఈ నెల 11న హై కోర్టుకు సిట్ స్టేటస్ రిపోర్ట్ సమర్పించనుంది.ఒకరి ద్వారా మరొకరికి పేపర్ చేరింది. ప్రవీణ్, రాజశేఖర్ నుంచి రూ.15 లక్షలకు పేపర్ తీసుకున్న నిందితులు.. మరికొంతమందికి విక్రయించారు. పోలీసుల విచారణలో ఈ విషయం బయటపడటంతో.. ఇలా ఎప్పటినుంచి పేపర్లు లీక్ అవుతున్నాయనే అంశం అభ్యర్థులను కలవరపెడుతోంది. ఇలా ఇంకా ఎన్ని పేపర్లు లీక్ అయ్యాయనేది ఆందోళనకరంగా మారింది. అనేక ప్రశ్నాపత్రాలను నిందితులు లీక్ చేసినట్లు గుర్తించారు. మరోవైపు పేపర్ లీక్ కేసుపై ఈడీ కూడా రంగంలోకి దిగింది. ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి విచారిస్తోంది. నిందితుల మధ్య లావాదేవీల విషయంపై ఆరా తీస్తోంది.నగదు లావాదేవీలు హవాలా మార్గం ద్వారా జరిగినట్లు ఈడీ అనుమానం వ్యక్తం చేస్తోంది. దీంతో నిందితుల మధ్య లావాదేవీలు ఎలా జరిగాయనే దానిపై ఈడీ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. పేపర్ లీక్ కేసును త్వరగా ఛేధించి.. వెంటనే కొత్త పరీక్షల తేదీలను ప్రకటించాలని నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. ఎవరో కొంత మంది చేసిన తప్పునకు లక్షల మంది విద్యార్థులు మానసిక వేదన అనుభవించాల్సి వస్తోందని అంటున్నారు.

# టార్గెట్ కేటీఆర్...

**హైదరాబాద్:**

తెలంగాణ రాజకీయంలో పేపర్ లీక్ మంటలు రాజుకుంటున్నాయి. ఈ కేసులో రోజుకో అంశం తెరపైకి రావడం సంచలనంగా మారుతోంది. హిందీ ప్రశ్నపత్రం పేపర్ లీకేజీ కేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్ట్ చేయడం, కోర్టు బెయిల్ మంజూరుతో బయటకు రావడం జరిగింది. అయితే ఈ వ్యవహారం బీఆర్ఎస్, బీజేపీ మధ్య మరోసారి పొలిటికల్ వార్ రాజుకుంది. ఈసారి వ్యూహం మార్చిన కమలనాథులు మంత్రి కేటీఆర్‌పై ఫోకస్ పెట్టారు. టీఎస్ పీఎస్సీ పేపర్ లీకేజీ విషయాన్ని డైవర్ట్ చేసేందుకే టెన్త్ లీకేజ్ కేసుకు బీజేపీకి ముడిపెడుతున్నారని కమలనాథులు ఆరోపిస్తున్నారు. బెయిల్‌పై బయటకు వచ్చిన బండి సంజయ్ కేటీఆర్ టార్గెట్‌గా సంచలన వ్యాఖ్యలు చేయడం ఆ వెంటనే కేంద్ర పెద్దలు బండి సంజయ్‌కు తోడుగా ఉన్నామని ప్రభుత్వంపై పోరాటం మరింత ఉధృతం చేయాలని సూచించంతో బీఆర్ఎస్ కష్టాలు తప్పవా అనే టాక్ వినిపిస్తోంది. టీఎస్ పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని, మెడలు పట్టి బయటకు పంపాలని బండి ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీనికి బాధ్యత వహించి యువతకు లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ కుటుంబమే లిక్కర్, లీకర్ కుటుంబంగా మారిపోయిందని చేసిందంతా చేసి లీకుల వ్యవహారాన్ని విద్యాశాఖ మంత్రిపై తోయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అయితే బండి సంజయ్ జైలు నుంచి వచ్చాక కేటీఆర్ టార్గెట్ గా తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించడం వెనకు బీజేపీ



కేటీఆర్ ను కార్నర్ చేయబోతోందా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో కేసీఆర్ జైలుకు వెళ్లడం ఖాయం అని చెప్పే బండి సంజయ్ తాజాగా కేటీఆర్ అరెస్ట్ అవ్వడం పక్కా అని చెప్పడం రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. ఇక బండి వ్యాఖ్యలపై స్పందించిన బీఆర్ఎస్ నేతలు కేసీఆర్ పై విచారమ జరుగుతుందని బండి సంజయ్ ఎలా చెబుతారని ఆయనేమైనా ఈడీనా, సీబీఐనా అని ప్రశ్నిస్తున్నారు. లీకేజీ పాపం అంతా బీజేపీదే అని కౌంటర్ ఇస్తున్నారు. ఏకంగా పేపర్ లీకేజీలో బీజేపీ పెద్దలు ఉన్నారని ఆరోపణలు గుప్పిస్తున్నారు.పేపర్ లీకేజీలో కేంద్రంలోని పెద్దల హస్తం ఉందని తాజాగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి లాంటి వారు చేసిన వ్యాఖ్యానించడం సెన్సేషన్ అవుతోంది. దీంతో తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పొలిటికల్ ఫైట్ ఢీ అంటే ఢీ అనేలా మారింది. ఈ రెండు పార్టీల మధ్య రాజకీయ యుద్ధం ఎటువైపు వెళ్తుందో చూడాలి మరి.

# వరాహనాధుడి ఉంగరం మాయం..

**భక్తులను తాడులతో బంధించి ఆలయ సిబ్బంది ఇంటరాగేషన్**

**అంతా క్రతువులో భాగమని తేలడంతో తేలికపడిన వాతావరణం**

**సింహాచలం**

ఏపీలోని విశాఖ జిల్లా సింహాచలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి వజ్రాల ఉంగరం మాయమైంది. ఈ సంఘటనతో గాబ రాపడిన ఆలయ సిబ్బంది, పూజారు లు, వైదిక సిబ్బంది ఆలయంలో హడా విడి చేశారు. స్వామివారి ఉంగరాన్ని వెతికి పట్టుకునేందుకు అన్నిచోట్లా వెతుకులాడారు. కానీ.. ఎక్కడా లభిం చకపోవడంతో.. ఆ సమయంలో స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులను తాళ్లతో కట్టేసి విచారిం చారు.ఈ హడావిడి చూసిన పలువురు భక్తులు భయంతో పరుగులు తీశారు. అయితే.. ఇదంతా.. స్వామివారి వార్షి క తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా నిర్వహించే..ఉంగరపు సేవ కార్యక్రమం లో భాగమేనని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు.ఉంగరపు సేవ వేడుక ను వినోదాత్మకంగా నిర్వహించారు. చోరీకి గురైన స్వామివారి ఉంగరాన్ని వెతికే ఘట్టాన్ని అర్చకులు, సిబ్బంది చక్కగా నిర్వహించారు.పలువురు భక్తులను, అధికారులను బంధించి.. చోరీకి గురైన స్వామి వారి ఉంగరాన్ని మీరే తీశారంటూ ప్రశ్నించిన తీరు భక్తు లకు వినోదాన్ని పంచింది.ఉత్సవంలో భాగంగా ముత్యాల పల్లకీలో మహా రాజా అలంకరణలో ఆశీనులైన స్వామివారి మేలి ముసుగులో బంగా రు ఉంగరం దొరకడంతో వినోదోత్సవం ఉత్సాహంగా ముగిసింది. అనంతరం ఆలయ భోగమండపంలో స్వామి, అమ్మవార్ల సంవాదోత్సవం సంప్రదా యబద్ధంగా నిర్వహించారు. ఉంగరం లేకపోతే లోనికి రానివ్వబోమని అమ్మవార్లు స్వామి వారిని గుమ్మం ఎదుటే తలుపులు మూసి వేసిన ఘట్టాన్ని వేడుకగా నిర్వహించారు. సంవాద సేవ అనంతరం అమ్మవార్లు ప్రసన్నం కావడంతో.. అమ్మవారు, స్వామివారి తరఫున భక్తులు పూల బంతులు విసురుకుని ఆనందాన్ని వ్యక్తం చేశారు. బేడామండపంలో తిరువీధి, పూర్ణాహుతితో ఉత్సవం ముగిసింది.

# సమాజసేవే 'కోరమండల్ ' లక్ష్యం

**కాకినాడ**

సమాజ సేవను సామాజిక బాధ్యతగా భావించి పలు సేవా కార్యక్రమాలను తమ కోరమాండల్ ఫెర్టిలిజర్ సంస్థ నిరంతరం కొనసాగిస్తుందని ఆ సంస్థ మహిళా క్లబ్ కార్యదర్శి మల్లీశ్వరి పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో కోరమండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యాన్ని తమ సంస్థ యాజమాన్యం అందిస్తుందన్నారు. అదేవిధంగా కంటి చూపు పరిరక్షణ గాను నిరంతరం కంటి వైద్య శిబిరాలను కూడా తమ సంస్థ నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ,అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనకు కూడా తమ సంస్థ సహకరిస్తుందన్నారు. అదేవిధంగా తమ క్లబ్ అధ్యక్షురాలయిన వెంకట దుర్గావతి సూచన మేరకు ప్రతినెలా ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు అందజేస్తున్నట్లు మల్లీశ్వరి తెలిపారు. కోరమండల్ ఫెర్టిలైజర్ సంస్థ పేద ప్రజల సంక్షేమానికి అందిస్తున్న సేవలను ప్రముఖ సాహిత్య వేత్త డాక్టర్ శిరీష కొనియాడారు. ఈ కార్యక్రమంలో , శ్రీదేవి, విజయలక్ష్మి ,మోహిని అంజుమ్, రేలంగి బాపిరాజు, అడబాల రత్న ప్రసాద్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# మణిపాల్ ఆస్పత్రిలో అరుదైన కాలేయ మార్పిడి ఆపరేషన్లు

**విజయవాడ**

మణిపాల్ హాస్పిటల్ సౌత్ ఏషియన్ లివర్ ఇనిస్టిట్యూట్ భాగస్వామ్యంతో 12 మందికి ఆరుదైన కాలేయ మార్పిడి ఆపరేషన్లు చేసినట్లు ఆ ఆసుపత్రి డైరెక్టర్ డా. సుధాకర్ కంటిపూడి అన్నారు.మణిపాల్ హాస్పిటల్ విజయవాడలో కాలేయ చికిత్సకు సంబంధించి కావలసిన వైద్య సదుపాయాలు అన్నీ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయి. వైద్య నిపుణులు, పారామెడిక్స్ టీం లు 24గంటలూ అందుబాటులో ఉంటారు. భారతదేశంలో సుమారు 50వేల మంది కాలేయ మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారు. కేవలం 25 కాలేయ మార్పిడి కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. . ఇవి సంవత్సరానికి 800 నుండి 1,000 మార్పిడిని నిర్వహిస్తున్నాయి. మణిపాల్ లో అందుబాటులోకి వచ్చిన అధునాతన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఆపరేషన్లకు 30 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ప్రభుత్వం సి.ఎం.ఆర్.ఎఫ్ కింద పది లక్షల వరకు సాయం అందిస్తుంది. 12 మందికి విజయవంతంగా కాలేయ మార్పిడి చికిత్స చేశామని అన్నారు.

ప్రొఫెసర్ డాక్టర్ టామ్ చెరియన్ మాట్లాడుతూ మణిపాల్ హాస్పిటల్ లో అత్యంత క్లిష్టమయిన కాలేయ శస్త్రచికిత్సలను పూర్తి చేశాం. ముఖ్యంగా మరణాంతర కాలేయ మార్పిడి, కాలేయ దాతల ద్వారా చేసే మార్పిడి. క్యాన్సర్లకు లివర్ రెసెక్షన్లు, పోర్టల్ వెయిన్ థ్రాంబోసిస్ కోసం మార్పిడి చేసాం. చిన్న వయసు వారిలో కాలేయ మార్పిడి లాంటి మొదలైనవి నిర్వహించాం. కాలేయ వ్యాధి నాణ్యమైన చికిత్సకు సరైన నిపుణుల బృందం మౌలిక సదుపాయాలు అవసరం. కాలేయ మార్పిడి అనేది సంక్లిష్టమైన డిమాండ్ ఉన్న శస్త్రచికిత్స. ఇప్పటి వరకు కాలేయ మార్పిడి శస్త్రచికిత్స కోసం రోగులు ఇతర రాష్ట్రాల వైపు చూసే వారు. కీలకమైన కాలేయ శస్త్ర చికిత్సలు మణిపాల్ హాస్పిటల్- సౌత్ ఏషియన్ భాగస్వామ్యంలో చేస్తున్నాం. లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ పై ప్రజల్లో ఉన్న వివిధ అపోహలు కూడా తొలగించుకోవాలి. చివరి దశకు చేరుకున్న వారికి కూడా అధునాతన కాలేయ మార్పిడి పద్ధతుల ద్వారా అద్భుతమైన చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు.

# విభజన హామీలు నెరవేర్చాలి

**హైదరాబాద్**



ప్రధాని నరేంద్ర మోడీ కి తెలంగాణ రాష్ట్రం సమస్యల పరిష్కారానికి ఎదురుచూస్తూ వైఎస్సార్ తెలంగాణ పార్టీ స్వాగతం పలుకుతోంది. తొమ్మిదేండ్లు కావొస్తున్నా విభజన హామీలు నెరవేర్చకపోవడం బాధాకరం. బడ్జెట్ లోనూ తెలంగాణకు ప్రత్యేక కేటాయింపులు లేవు. ఈ సభలోనైనా తెలంగాణకు నిధులు ప్రకటించాలని కోరుతున్నామని ఆ పార్టీ అధినేత్రి షర్మిల అన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు 'కాళేశ్వరం కేసీఆర్ కు ఏటీఎం అని బీజేపీ ఖ లీడర్లు బుకాయిస్తున్నారు కానీ ఎంక్వైరీ చేయడం లేదు. మా పార్టీ కాళేశ్వరం అవినీతిపై ఢిల్లీకి వెళ్లి పోరాటం చేసింది. కాగ్, సిబిఐ కి ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలులేవు. మీ రాజకీయస్వార్థం కోసం తెలంగాణ ప్రజల సొమ్మును పణంగా పెట్టడం విచారకరం. ప్రధాని రాష్ట్రానికి వస్తే ఎదురెళ్లి సమస్యలు పరిష్కరించండి అని నిలదీసే దమ్ము దొర గారికి లేదు. చేతకాని దద్దమ్మలా ఫామ్ హౌజ్ కే పరిమితమై, ప్రధాని వెళ్లిపోయాక అవాకులు, చెవాకులు పేల్చడం కేసీఆర్ కి అలవాటుగా మారింది. దొర గారి రాజకీయాలు, మొండివైఖరితో తెలంగాణకు అన్యాయమే జరుగుతోందని ఆమె అన్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

## కిరణ్ కుమార్ రాకను స్వాగతిస్తున్నాం

**విశాఖపట్నం**

ప్రతి పక్షాలు అవినీతి బయట పడుతుంది అన్న భయంతో పార్లమెంట్ లో చర్చలు అడ్డుకున్నా యని బీజేపీ ఎంపి జీవిఎల్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ బీజేపీ వ్యవస్థా పక దినోత్సవ వేడుకల సమయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు అంశాలు పై యుద్ధం చేయాలని పిలు పు ఇచ్చారని గుర్తు చేశారు.రెండు తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ అధికారం దిశగా అడుగులు వేస్తుందని అన్నారు. మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి బీజే పీలో చేరడం స్వాగతిస్తున్నామని, రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున చేరికలు ఉంటాయని చెప్పారు.

## అల్లు అర్జున్ జన్మదిన సంబరాలు

**కౌతాళం**

మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో మెగాస్టార్ చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు మంగలి ఉరుకుంద మరియు ఐకాన్ స్టార్ సేవాసమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ జన్మదిన సందర్భంగా పెద్ద ఎత్తున డ్రమ్స్ తో ర్యాలీ చేస్తూ బానసంచాలు పేలిస్తూ అల్లు అర్జున్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి అనాధలకు పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా డాక్టర్ డానియల్ సైకిల్ షాప్ డేనియల్ చిన్నబాబు పాల్గొన్నారు. తదనంతరం అల్లు అర్జున్ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ అల్లు అర్జున్ జన్మదిన అంటే మాకు పండుగ లాంటిదని తెలిపారు ఈ కార్యక్రమంలో చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు మంగలి ఉరుకుంద ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సేవాసమితి సభ్యులు ఉదయ్ కుమార్ గోవిందు గణేష్ రామ్ చరణ్ తేజ్ సంతోష్ రఘు వసంత నరేంద్ర పాల్గొన్నారు.

## బలహీనవర్గాలపై దాడులను అరికట్టాలి

**మదనపల్లె**

దళిత గిరిజన మైనార్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని అఖిలపక్షం నాయకులు ఆరోపించారు. నేడు మదనపల్లె పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో దేశంలో జరుగుతున్న ప్రజావ్యతిరేక విధానాలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్ప, సిపిఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి నరసింహులు, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతం, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మతోన్మాద బిజెపి పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాద చాందసవాదం, ఆర్ఎస్ఎస్ మనుధర్మ శాస్త్రం విధానాలను అమలు చేస్తూ ఈ దేశంలో కమ్యూనిస్టులు పైన అంబేద్కరిస్టుల పైన, సోషలిస్టులు పైన కళాకారుల పైన మేధావులు పైన విపరీతంగా దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. దీనిని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామిక వాదులు ఏకం కావాలని పిలుపునిచ్చారు.

## ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను వివరించాలి

**మదనపల్లె**

బిజెపి, టిడిపి, జనసేన ఇలా ఎన్ని పార్టీలు కలిసినా తమ నాయకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఏమి చేయలేరని ఎమ్మెల్యే నవాజ్ భాషా పిలుపునిచ్చారు. నేడు మదనపల్లె పట్టణంలోని గుండ్లూరు వీధిలో మా నమ్మకం నువ్వే జగనన్న పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ంఖఓఆఅ ఛైర్మన్ షమీంఅస్లాం, మదనపల్లె వైసిపి పరిశీలకులు హబీబ్ భాష, మున్సిపల్ ఛైర్ పర్సన్ వరపన మనూజ, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, సర్పంచులు, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధికి ముగ్గురు కన్వీనర్లు, ప్రతి 50 మందికి ఒక గృహ సారధిని నియమించిన్నట్లు తెలిపారు. వీరు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తెలియజేయాలని సూచించారు.

## అక్వా రైతులకోసం పోరాటం

**గూడూరు**

రాష్ట్రంలో ఆక్వా రంగం సంక్షేమంలో ఉందని ఫిషరీస్ అండ్ ఆక్వా బిజెపి సెల్ రాష్ట్ర కన్వీనర్ వేమారెడ్డి సురేందర్ రెడ్డి పేర్కొన్నారు . తిరుపతి జిల్లా గూడూరు పట్టణ పరిధిలోని చెన్నూరు గ్రామంలో ఆయన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు .

చెన్నూరు గ్రామంలోని ఫిషరీస్ అండ్ ఆక్వా బిజెపి సెల్ రాష్ట్ర కన్వీనర్ సురేందర్ రెడ్డి నివాసంలో స్థానిక బిజెపి నాయకులు శుక్రవారం ఆయనను కలిసి పూలమాలలు వేసి శాలవాలు కప్పి అభినందనలు తెలిపారు . ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సురేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని తీర ప్రాంతంలో వేలాది మంది కుటుంబాలు చేపలు మరియు రొయ్యల పెంపకం పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆయన పాదయాత్రలో ఆక్వా రైతులకు ఎన్నో వరాలు హామీలుగా ఇచ్చారని ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు బిజెపి ఆక్వా రైతుల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి ప్రకాష్ నాయుడు , బిజెపి నాయకులు బైరప్ప కిరణ్ రెడ్డి తేజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## నిర్భాగ్య పిల్లల పాలిట వరం మిషన్ వాత్సల్య పథకం

**అరకులోయ**



దేశంలో నిస్సయ స్దితిలో ఉన్న పిల్లల పాలిట వరం వంటిది మిషన్ వాత్సల్య పథకమని అల్లూరి సీతారామ రాజు జిల్లా చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (సీఆర్పీఎఫ్) కన్వీనర్ డాక్టర్ బాకా లవకుశ అన్నారు,మండలంలోని లోతేరు పంచాయితీ శనివారం సంతలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక(సిఆర్పీఎఫ్) ఆధ్వర్యాన ఇటీవల ప్రవేశ పెట్టిన మిషన్ వాత్సల్య పథకంపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి కాని, తండ్రి కాని లేని,లేదా విడాకులు తీసుకున్న 18 సంవత్సర లోపు ఉన్న అనాద, నిర్భాగ్య పిల్లలను ఆదుకోవడానికి,వారి భవిష్యత్‌కు ఈ పథకం ద్వారా ఆర్థిక మేలు ఎంతో మేలు జరగనుందని అన్నారు, అనాథలు,నిస్సహాయ స్థితిలో ఉన్న బాలబాలికలకు ఆరోగ్యంతో పాటు ఆర్థికభరోసా కల్పించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయక్తంగా మిషన్ వాత్సల్య పథకాన్ని నూతనంగా ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం కింద అర్హులైన వారికి ప్రతినెలా రూ.4 వేలు అందజేయనున్నారు. ఈ పథకంలో చేరాలనుకొనేవారు గ్రామీణ ప్రాంత వాసులకు వార్షికాదాయం 72 వేలు పట్టణ ప్రాంతల వాసులకు 96 వేలు మించరాదన్నారు.అర్హులైన బాలబాలికలు ఈ పథకానికి వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలోని గ్రామ స్దాయి నుంచి మండల స్దాయివరకు ఈ పథకం వల్ల బాలలకు ఉపయుక్తతపై సిఆర్పిఎఫ్ విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యాతిదిగా హాజరైన లోతేరు పంచాయితీ సర్పంచి గుబ్బాయి కళావతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఈ పథకం నిర్భాగ్యులైన ప్రతి బాలబాలకు వర్తించే వాలంటీర్లు పనిచేయలన్నారు. ప్రతి ఇంటింటికి ఈ సమాచారం చేరేలాగ వాలంటీర్లు, అంగన్వాడీ టీచర్ , ఆయాలు మరియు ఆశ వర్కర్లు కూడ మన వంతు బాధ్యతగా మన పంచాయితీ వాసులకొరకు పనిచేయలన్నారు. అందరు సామాజిక స్పృహతో పౌరులంతా అబాగ్యులైన పిల్లలకు చేదోడు వాదోడుగా సమాచారం అందించాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది ఏప్రిల్ 15లోగా సంబందిత కార్యలయలో సమర్పించలన్నారు. దగ్గరరలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలతో పాటు ఐ సిడిఎస్ సిడిపిఒ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్ సర్పంచి గుబ్బాయి శ్రీరామ్ , వైస్ సర్పంచి, ఆశ వర్కర్లు అంగన్వాడి ఆయలు గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## బద్వేల్ నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్

**బద్వేలు**

'మా నమ్మకం నువ్వే జగన్' అనేది ప్రజల నినాదమని మాజీ ఎమ్మెల్యే వైకాపా ఎమ్మెల్సీ డిసి గోవింద్ రెడ్డి తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాల పట్ల ప్రజల్లో సంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. అందుకే 'జగనన్నే మా భవిష్యత్' అని జనం అంటున్నారని చెప్పారు. ప్రజాప్రతినిధులతో పాటు వైసీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి పలు కుటుంబాలను నేరుగా కలిశారు. చంద్రబాబు పాలనకు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు తేడాను వివరించి ప్రజల మద్దతు కోరారు. భవిష్యత్‌లోనూ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా ఉంటారా? సంక్షేమ పథకాలు అందుతున్న తీరు బాగుందా? ఇంకా ఏమైనా మార్పు చేయాలా? అని ప్రజల అభిప్రాయం తెలుసుకున్నారు. అంతకుముందు మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 60 లక్షల కుటుంబాలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన పార్టీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు కలవడమే లక్ష్యంగా 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఈనెల 20వ తేదీ వరకు దాదాపు 14 రోజులు ప్రజలతో మమేకమవుతామన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఈ మూడేళ్ల 10 నెలలుగా సీఎం జగన్ నాయకత్వంలో క్లిష్టపరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. ఎన్నికల సమయంలో జగన్ చేసిన వాగ్ధానాలను 98 శాతం అమలు చేసినట్లు తెలిపారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇంత పెద్ద ఎత్తున ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. ఎక్కడా అవినీతి, పక్షపాతం లేకుండా పథకాలు అందిస్తున్నామని, అందరికీ సంక్షేమం అందించిన ఘనత తమ ప్రభుత్వానిదని చెప్పారు. పరిపాలనలో నూతన సంస్కరణలు తెచ్చి ప్రజల వద్దకు పాలన చేరువ చేశామన్నారు. సచివాలయ వ్యవస్థ తెచ్చి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టామన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా మూడేళ్ల 10 నెలల్లో రూ.2 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారులకు అందజేసిన ఘనత తమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని అన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా ఏపీని ఆదర్శంగా తీసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించలేదని చెప్పారు. మరో ఏడాదిలో ఎన్నికలు వస్తున్నాయని తెలిసి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. పేదల పక్షాన తమ ప్రభుత్వం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ తరం బాగుపడాలన్నా.. భవిష్యత్ తరాలకు ఉజ్వల భవిష్యత్ ఉండాలన్నా వైసీపీ అధికారంలో ఉండాలని, జగన్ సీఎంగా కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నట్లు చెప్పారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి క్లస్టర్ పరిధిలో రోజూ 10 నుంచి 15 కుటుంబాలను కలిసి ప్రజామద్దతు కోరనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత ప్రజల సమ్మతితో ప్రతి ఇంటికీ స్టిక్లర్లు అందిస్తామన్నారు. వైసీపి నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు పేదలకు ఏదైనా మంచి జరిగిందంటే అది జగన్ సీఎం అయిన తర్వాతేనని చెప్పారు. భవిష్యత్‌లో ఇంకా మంచి జరగాలంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు.

# మోడీని ఆశీర్వదించండి

**హైదరాబాద్:**



సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్ రైలును ప్రారంభించిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ వేదికపై నలుగురికే కూర్చుకునే ఛాన్స్ ఇచ్చారు. ఇద్దరు కేంద్రమంత్రులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, తెలంగాణ గవర్నర్ తమిళిసైకు కుర్చీ వేశారు. ఈ వేదికపై నుంచి నేషనల్ హైవే పనులకు, బీబీనగర్ ఎయిమ్స్ బిల్డింగ్స్‌కు, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ రైల్వే డబ్లింగ్ లైన్‌ను జాతికి అంకితం చేశారు. ఎంఎంటీఎస్ రెండో దశలో భాగంగా పలు రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు మోదీ. ఈ వేదికపై మాట్లాడిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రాష్ట్రప్రభుత్వం చేసిన ఆలస్యం కారణంగా ఎంఎంటీఎస్ రెండో దశ పనులు ఆలస్యమయ్యాయి అన్నారు. ఇంకా ఏమన్నారంటే"ప్రతి హిందువు వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవాలని అనుకుంటాడు. వాళ్ల సౌకర్యార్థం సికింద్రాబాద్-తిరుపతి మధ్య వందేభారత్ ట్రైన్ తెలుగు ప్రజలకు మోదీ అంకితం చేశారు. ఇది 14వ ట్రైన్. ఇందులో రెండు తెలుగు ప్రజలకు బహుమతిగా ఇచ్చారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 714 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునికీకరణ పనులు ప్రారంభిస్తారు. భవిష్యత్‌లో పెరిగే జనాభాకు అనుగుణంగా ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేలా ఈ పనులు చేపట్టనున్నారు. హైదరాబాద్-మహబూబ్‌నగర్ మధ్య 1410 రూపాయలతో చేపట్టిన డబ్లింగ్ లైన్‌ను జాతికి అంకితం చేస్తారు. రాష్ట్రప్రభుత్వం సహకరించకపోయినా బీజేపీ ఎంపీల అభ్యర్థన మేరకు 13 కొత్త ఎంఎంటీఎస్ ట్రైన్లు, రెండో దశ పనులను జాతికి అంకితం చేస్తారు. ఏ రాష్ట్రాన్నైనా భేదభావం లేకుండా అభివృద్ధి చేస్తాం. 32 జిల్లాలకు జాతీయ రహదారులను అనుసంధానం చేశాం. ఇవాళ తెలంగాణ ప్రజలకు ఎన్నో రకాల లాభం చేకూర్చాం. అందుకే మోదీని ఆశీర్వదించాలని కోరుతున్నాను- కిషన్ రెడ్డి"మరో మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతు తెలంగాణ ప్రభుత్వానికి కీలక సూచనలు చేశారు. ప్రపంచస్థాయిలో సికింద్రాబాద్ స్టేషన్ అభివృద్ధి చేసేందుకు కేంద్రం సిద్ధమైందన్నారు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్. తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం కావాలని పిలుపునిచ్చారు. భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని సూచించారు. తొమ్మిదేళ్లలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైల్వేల రూపురేఖలను మార్చేశారన్నారు. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధి కోసం 4400 కోట్ల రూపాయలు కేటాయించినట్టు గుర్తు చేశారు.

## ఆ జడ్జి నాలుక కోస్తా

**చెన్నై:**

రాహుల్ గాంధీపై అనర్హతా వేటు వేసినప్పటి నుంచి పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ శ్రేణులు నిరసనలు చేస్తున్నాయి. తమిళనాడులోనూ కాంగ్రెస్ నేతలు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపడుతున్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా...నినాదాలు చేస్తున్నారు. అయితే...ఓ కాంగ్రెస్ లీడర్ హద్దు దాటి నినాదాలు చేశారు. రాహుల్ గాంధీకి రెండేళ్లు జైలు శిక్ష విధించిన జడ్జ్ నాలుక కట్ చేస్తామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు...ఆయనపై కేసు నమోదు చేశారు. కాంగ్రెస్ దింగల్ జిల్లా అధ్యక్షుడు మణికందన్ ఈ కామెంట్స్ చేశారు. "మేం అధికారంలోకి వచ్చాక రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చిన జడ్జ్ నాలుకను కోసేస్తాం" అని తీవ్ర పదజాలంతో మాట్లాడారు. నిరసన కార్యక్రమంలో ఈ కామెంట్స్ చేసినట్టు పోలీసులు వెల్లడించారు. "మార్చి 23వ తేదీన సూరత్ కోర్టు జడ్జ్ రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మేం అధికారంలోకి రాగానే ఆ జడ్జ్ నాలుక కోసేస్తాం. ఎవరికి శిక్ష విధించారో అర్థమవుతోందా..? ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి పెట్టింది ఎవరు..? మా రాహుల్ గాంధీ కుటుంబం కాదా..? కాంగ్రెస్ ఉద్యమం వల్లే స్వాతంత్ర్యం రాలేదా..?. మీరు ఇంత స్వతంత్రంగా ఉండగలుగుతున్నారంటే అందుకు కారణం కాంగ్రెస్ పార్టీయే. అలాంటి వ్యక్తికి వ్యతిరేకంగా తీర్పునిచ్చారు. ప్రజలు మౌనంగా ఉన్నారని మీరు అనుకుంటున్నారు. కానీ వాళ్లు అన్నీ గమనిస్తున్నారు. వాళ్లు కచ్చితంగా బీజేపీని దేశం నుంచి తరిమికొడతారు.ఈ స్పీచ్ ఇచ్చిన వెంటనే చుట్టూ ఉన్న కాంగ్రెస్ నేతలు చప్పట్లు కొడుతూ ప్రశంసించారు. పోలీసులు మాత్రం దీన్ని తీవ్రంగా పరిగణించారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు పడిన వెంటనే ఆయన అధికారిక నివాసమైన బంగ్లాను ఖాళీ చేయాలంటూ నోటీసులు పంపించారు. ప్రస్తుతం ఇక్కడి నుంచి తన ఆఫీస్‌ను తరలించే పనిలో ఉన్నారు రాహుల్. కాంగ్రెస్ సీనియర్ నేతలు అందరూ తమ ఇంటికి రావాలంటూ వెల్‌కమ్ చెప్పారు. ఆయనకు మద్దతుగా నిలిచారు. అయితే..రాహుల్ గాంధీ 10 జన్‌పథ్‌లోని తన తల్లి సోనియా గాంధీ ఇంటికి షిఫ్ట్ అవనున్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే రాహుల్ బంగ్లాలోని సామాన్లను సోనియా ఇంటికి తరలిస్తున్నట్టు సమాచారం. దీంతో పాటు ఆఫీస్ కోసం మరో ఇంటినీ వెతుకున్నారని తెలుస్తోంది.

## కాకినాడలో అనిల్ ఆచూకీ

**కాకినాడ:**

అతను మామూలు దొంగ కాదు.. కరుడుగట్టిన గజదొంగ.. అతను పేరు వింటే చాలు ప్రజలు భయంతో వణికిపోతారు.. తాజాగా మోస్ట్ వాంటెడ్ క్రిమినల్.. అవుల అనిల్ తూర్పుగోదావరి జిల్లాలో మళ్లీ యాక్టివ్ అయ్యాడు. కాకినాడ ఎల్ బీ నగర్‌లో ఓ ఇంటి ముందు అనిల్ రెక్కి నిర్వహించాడు. అక్కడ ఉన్న సీసీ కెమెరాల్లో ఆ దృశ్యాలు రికార్డు అయ్యాయి. పలు కేసుల్లో నిందితుడుగా ఉన్న ఆవుల అనిల్ కుమార్ మరోసారి ప్రత్యక్షం అవ్వడంతో అప్రమత్తమైన కాకినాడ డీఎస్పీ ప్రజలను అలర్ట్ చేశారు.దొంగ ఆవుల అనిల్ కుమార్ కాకినాడ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు వెల్లడించారు.ఇతడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా?ల్లో పలు కేసుల్లో నిందితుడని క్రైం డీఎస్పీ రాంబాబు వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అతడిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు.ఆవుల అనిల్ కుమార్ కదలికలపై పెద్దాపురం, కాకినాడ సబ్‌డివిజన్లలో గల ఎస్సైలు, పోలీసు సిబ్బందిని అలెర్ట్ చేసినట్లు డీఎస్పీ రాంబాబు వెల్లడించారు. గ్రామాల్లో విలేజ్ కమిటీలు కూడా అప్రమత్తంగా ఉండి మైకుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నిందితుడు ఆవుల అనిల్‌ను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

అతడి కదలికలపై నిఘా పెట్టామని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ రాంబాబు పేర్కొన్నారు. త్వరలోనే అనిల్ ను పట్టుకుంటామని.. ఎక్కడైనా తారసపడితే సమాచారం అందించాలని సూచించారు.

## మూగజీవికి ఘనంగా అంత్యక్రియలు

**మహబూబ్ నగర్:**

వ్యవసాయం చేసేవారు పశువులను కూడా తమ కుటుంబసభ్యుల్లా భావించి ప్రేమిస్తుంటారు. అలా తాను అల్లారు ముద్దుగా ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్న ఎద్దు చనిపోవడాన్ని ఆ రైతు కుటుంబం తట్టుకోలేకపోయింది. దానికి సంప్రదాయ పద్ధతిలో అంతిమ సంస్కారాలు నిర్వహించి మమకారాన్ని చాటుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా అంబటిపల్లి గ్రామంలో తిరుపతయ్య అనే రైతుకు చెందిన బసవేశ్వర అనే ఎద్దు 14 సంవత్సరాలగా తనతోనే ఉంటుంది. అయితే కొన్ని రోజులు దాని ఆరోగ్యం బాగోవడం లేదు. దీంతో ఆసుప్రతిలో చేర్పించాడు..పరిస్థితి విషమించి ఆ ఎద్దు చనిపోయింది. దీంతో చిన్నప్పటి నుంచి పెంచిన కుటుంబ సభ్యులు దాని మరణాన్ని జిర్ణించుకోలేకపోయారు?తమ నుంచి దూరమైన ఆ బసవేశ్వరకి అంతిమ సంస్కారాలను మనుషులతో సమానంగా నిర్వహించారు. వారితో పాటు ఊరు ఊరంతా కదిలి వచ్చింది. గ్రామంలోని స్మశాన వాటిక వరకు అంతిమయాత్ర నిర్వహించారు. అంతిమయాత్ర వాహనానికి డీజే సౌండ్ బాక్సులతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. చివరగా స్మశానంలో ఖననం చేసి నివాళులర్పించారు. జంతువుల పట్ల మనుషులు ప్రేమ పెంచుకుంటే అవి దూరమైనప్పుడు చూపించే ఆప్యాయతకు ఉదాహరణగా నిలిచింది ఈఘటన.ప్రజలందరితో కలిసి భారీ ఊరేగింపు నిర్వహించారు.

# ఏపీలో పొలిటికల్ వారసులు

## ఖర్చీఫ్ వేస్తున్న నేతాశ్రీలు

**విజయవాడ:**

ఏపీ పాలిటిక్స్‌లో ఇప్పుడు వారసుల సీజన్ నడుస్తోంది. ఎక్కడికక్కడ పార్టీ సీనియర్ లీడర్స్ తమ కొడుకులు, కూతుళ్ళని వచ్చే ఎన్నికల కోసం సిద్ధం చేస్తున్నారు. ఈసారి టిక్కెట్ మాకు ఇవ్వకున్నా ఫర్లేదు? మా వాళ్ళకు ఇవ్వండంటూ పార్టీ నాయకత్వాలకు సంకేతాలు పంపుతున్నారు. మరికొందరైతే ఏకంగా అధిష్ఠానం పెద్దల దగ్గరే తమ మనసులోని మాటను చెప్పేస్తున్నారు. అట్నుంచి ఎలాంటి క్లారిటీ రాకున్నా. ఎవరి ప్రయత్నాలు వారు మాత్రం చేస్తున్నారు. గతంలో ఇంటింటికీ మన ప్రభుత్వం కార్యక్రమంలోనే తమ వారసుల్ని దింపాలని కొందరు నాయకులు ప్రయత్నించినా జగన్ వారించి వారినే తిరగమనడంతో అప్పటికి తగ్గారు. తిరిగి ఇప్పుడు ప్రయత్నాలు మొదలుపెట్టారు. చిత్తూరు జిల్లాలో వారసుల హంగామా హాట్ టాపిక్ అయింది. తిరుపతి నుంచి కుప్పం దాకా కుదిరిన చోటల్లా ముఖ్య నాయకుల కొడుకులు, కూతుళ్ళు క్రియాశీలకంగా మారుతున్నారు. అందులో అగ్ర భాగాన ఉన్నారు తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి. ఆయన కుమారుడు అభినయ్ రెడ్డికి మొదట్నుంచి రాజకీయాల మీద ఆసక్తి ఎక్కువ. నియోజకవర్గానికి ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డే అయినా అనధికారికంగా అంతా అభినయే నడుపుతున్నారట. పార్టీ నాయకులతోనే కాకుండా అధికారులతో కూడా నేరుగా మాట్లాడే వాడట. చివరికి తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లో అభినయ్ రెడ్డి కార్పొరేటర్‌గా ఏకగ్రీవమయ్యాయి. తర్వాత డిప్యూటీ మేయర్ పదవి వచ్చింది. ఇప్పుడు అధికారిక హోదాలోనే సిటీ అంతా తిరుగుతున్న డిప్యూటీ మేయర్ ఈసారి ఎన్నికల్లో తిరుపతి బరిలో తానే దిగేందుకు సిద్ధమవుతున్నారట. కరుణాకర్‌రెడ్డి కూడా కొడుకుని ఎమ్మెల్యేగా చూడాలని తహతహలాడుతున్నారట. అందుకుతగ్గట్టే ఈసారి ఎన్నికలకు దూరంగా ఉంటానని గతంలోనే ఆయన ప్రకటించారు కూడా. ఇక చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కూడా ఇదే రూట్లో ఆలోచిస్తున్నారట. ఆయన పెద్ద కుమారుడు మోహిత్ రెడ్డిని రాజకీయ నాయకుడిగా నిలబెట్టాలని చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు. వైసీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న మోహిత్ రెడ్డి తిరుపతి రూరల్ నుంచి ఎంపీటీసీగా ఎన్నికై ఎంపీపీ పదవి చేపట్టారు. అదే హోదాలో చంద్రగిరి నియోజకవర్గం మొత్తం పాదయాత్ర చేయడం హాట్ టాపిక్ అయింది. అంటే నెక్ట్స్ నేను రెడీగా ఉన్నానన్న సంకేతాలు పంపారన్నది లోకల్ టాక్. నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల్లో సైతం నేరుగానే జోక్యం చేసుకుంటున్నారు మోహిత్. మోహిత్ రెడ్డి పోటీకి జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని స్వయంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డే ప్రకటించారు. పార్టీ పరంగా 23 అనుబంధ సంఘాల బాధ్యతలను చెవిరెడ్డికి అప్పగించడంతో ఆయన ఆ పెద్దరికపు బాధ్యతల్లో ఉండి కొడుకుని ఎమ్మెల్యేగా గెలిపించి వెనకుండి నడిపించాలనుకుంటున్నారట. ఎన్నికల తర్వాత చెవిరెడ్డికి టీటీడీ ఛైర్మన్‌గానీ రాజ్యసభ సీటు గానీ ఇస్తానని చెప్పారట జగన్. అందుకే ఇక వారసుడి భవిష్యత్‌పై ఫుల్ ఫోకస్ పెట్టారట భాస్కర్‌రెడ్డి. వీరితో పాటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్న కుమారుడు సుధీర్ రెడ్డి సైతం పీలేరు, మదనపల్లె, పలమనేరులో ఏదో ఒక చోట నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కుమారుడు సుమన్ పరిస్థితి కూడా ఇంతే. ఆదిమూలం ఎమ్మెల్యే అయ్యాక సుమన్ నియోజకవర్గంలో చెలరేగిపోయారు. స్థానిక ఎన్నికల్లోనారాయణ వనం జడ్పీటీసీగా ఏకగ్రీవం అయ్యారు. తర్వాత అదే హోదాలో అధికారిక కార్యక్రమాలన్నిటికీ హాజరవుతున్నారు. జీడీ నెల్లూరులో డిప్యూటీ సిఎం నారాయణ స్వామి కూడా తన కుమార్తెకు పోటీ చేసే అవకాశం ఇవ్వాలని అధినాయకత్వాన్ని అడిగినట్టు తెలిసింది. అయితే? ఇప్పటివరకు భూమన, చెవిరెడ్డి వారసులకు మాత్రమే గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టు తెలిసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా విషయానికి వస్తే? గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్న ముస్తఫా, తన కుమార్తెను రాజకీయ వారసురాలిగా ప్రకటించారు. అధిష్టానం ఆశీస్సులు ఉన్నాయని, 2024 ఎన్నికల్లో ఫాతిమాకు సీటు వస్తుందని ఇప్పట్నుంచే ప్రచారం చేసుకుంటున్నారు. అందుకు తగ్గట్టే ఫాతిమా కూడా గడప గడపకు కార్యక్రమంలో తిరుగుతూ ప్రజలు, అధికారులకు పరిచయం అవుతున్నారు. రాజ్యసభ ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు రేపల్లె నియోజకవర్గం ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. తాను ఎంపీగా ఉండగానే కుమారుడికి పొలిటికల్ రూట్ క్లియర్ చేసే పనిలో ఉన్నారాయన. ఈసారి ఎన్నికల్లో మోపిదేవి రాజీవ్‌ను రంగంలోకి దింపే ప్రయత్నాల్లో ఉన్నారు వెంకటరమణ. ఇక మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి కుమారుడు పోటీ చేయబోతున్నారన్న ప్రచారం ఉంది. ఇటీవల కాలంలో అయోధ్య రామిరెడ్డి మంగళగిరి నియోజకవర్గాన్ని వదిలిపెట్టకుండా తిరుగుతున్నారు. ఇక్కడ ఇప్పటికే అయోధ్యరామిరెడ్డి సోదరుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈసారి పోటీకి ఆర్కే పోటీ చేయడానికి విముఖత చూపిస్తే, తన కుమారుడిని రంగంలోకి దింపాలన్న ఆలోచనలో ఉన్నారట అయోధ్య రామిరెడ్డి. తెనాలి నియోజకవర్గంలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి కుమారుడు పోటీ చేయబోతున్నారన్న ప్రచారం జరుగుతోంది. కమ్మ సామాజిక వర్గానికి మిగిలిన పార్టీలు టిక్కెట్ ఇస్తే వైసిపి నుంచి కాపు సామాజిక వర్గ నేతగా ముద్రపడ్డ బాలశౌరి కుమారుడితో పోటీ చేయించాలన్న యోచనలో నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక కృష్ణా జిల్లాలో తండ్రి వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చిన పేర్ని నాని తాను లైమ్‌లైట్‌లో ఉండగానే కుమారుడిని సెటిల్ చేయాలన్న ఆలోచనలో ఉన్నారట. మూడు సార్లు మచిలీపట్నం నుంచి ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు మంత్రిగా పనిచేసిన పేర్ని నాని ఇక రాజకీయాలకు గుడ్ బై చెప్పాలని అనుకుంటున్నారట. తన తండ్రి ఏ విధంగా రిటైర్డ్ మెంట్ తీసుకున్నారో.. అలాగే ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన తాను కూడా రిటైర్మెంట్ తీసుకోవాలని భావిస్తున్నారట. అందుకే ఇప్పుడు తన కుమారుడు కిట్టును వచ్చే ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకువచ్చి మచిలీపట్నం బరిలో దింపే ప్రయత్నాల్లో ఉన్నారట. కిట్టు అరంగేట్రానికి గడప గడపకు కార్యక్రమాన్నే వేదికగా మలుచుకుంటున్నారట పేర్ని. పార్టీ కార్యక్రమాల్లో తండ్రికంటే ఎక్కువగా కుమారుడు పాల్గొనడం ఇప్పుడు బందరులో హాట్ టాపిక్ అయింది. తన మనసులోని మాటను పార్టీ అధిష్టానం దగ్గర చెప్పారట పేర్ని. కానీ అట్నుంచి ఇంకా క్లారిటీ రాలేదట. రాజకీయ వారసులకు మంచి టేకాఫ్ ఇవ్వాలనే ఆలోచన ఉమ్మడి విశాఖ జిల్లా సీనియర్స్‌లో కూడా కనిపి స్తోంది. ఈ జాబితాలో టీడీపీ నుంచి మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, అయ్యన్న పాత్రుడు ఉన్నారు. ప్రస్తుతం విశాఖ నార్త్ ఎమ్మెల్యేగా ఉన్న గంటా శ్రీనివాసరావు వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గం మారాలని చూస్తున్నారు. అది కూడా సెమీ అర్బన్ లుక్ ఉన్న భీమిలి, పెందుర్తి, య లమంచిలిలో ఏదో ఒకటి ఐతే.. విజయం తేలిక అవుతుందని లెక్కలేసుకుంటున్నారు. అదే సమయంలో గంటా కుమారుడు రవితేజ రాజకీయ ఆరంగేట్రం కోసం కసరత్తు జరుగుతోందట. కాపు సామాజిక వర్గం ఎక్కువగా వున్న చోడవరం స్థానం నుంచి పోటీ పెడితే ఎలా ఉంటుందనే చర్చ జరుగు తోందట. కానీ.. టీడీపీలో తండ్రీ, కొడుకులకు టిక్కెట్లు దక్కే అవకాశాలపై చర్చ జరుగుతోందట. ఇక్కడే కొత్త లెక్కలు తీస్తోంది గంటా వర్గం. పార్టీలో కీలకంగా ఉన్న మాజీమంత్రి నారాయణకు అల్లుడు రవితేజ. ఈ కోటా వర్కవుట్ అయితే అవకాశాలు మెరుగుపడ తాయనే అభిప్రాయం ఉంది. ఇక, మరో మాజీమంత్రి., పొలిట్ బ్యూరో సభ్యుడు అయ్యన్న కూడా ఈసారి రాజకీయ వారసుడి కోసం గట్టిగా పట్టుబట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పార్టీ ఐటీ వింగ్‌ను పర్యవేక్షిస్తున్న చింత కాయల విజయ్ ఈసారి ఎన్నికలలో పోటీకి సిద్ధం అవుతున్నారట. ఆరోగ్యకారణాలతో అయ్యన్న 2029నాటికి యాక్టివ్ పాలిటిక్స్ లో ఉండకపోవచ్చు. అంతకంటే ముందే.. అంటే వచ్చే ఎన్నికల నాటికి వారసుడికి బలమైన పునాదులు వేయాలని. అనకాపల్లి ఎంపీగా పోటీకి సిద్ధం చేయాలన్న ప్లాన్‌లో ఉన్నారట. అయితే..ఎన్నికల నాటికి సీట్ల కోసం పోటీ పెరుగుతుంది. పొత్తులు తెరపైకి వస్తాయి. అప్పటి సమీకరణాలు ఎంత వరకు విజయ్ కి సానుకూలంగా ఉంటాయనేది అనుమానమే. ఇక, వైసీపీ నుంచి వారసులకు సీట్లు ఆశిస్తున్న నేతలకు కొదవ లేదు. ఈ జాబితాలో మొదట చర్చ గాజువాక గురించే జరుగుతుంది. 2019 ఎన్నికల్లో పవవన్ కల్యాణ్ పోటీతో ఇక్కడ బాగా హైప్ వచ్చేసింది. పవన్‌ను ఓడించిన సిట్టింగ్ ఎమ్మెల్యే నాగిరెడ్డి వయోభారం కారణంగా వచ్చే ఎన్నికల్లో పోటీకి అంత ఆసక్తిగా లేరట. దీంతో తన కుమారుడు దేవన్ రెడ్డి పేరును పరిశీలిచాలని హైకమాండ్ ను అభ్యర్థిస్తున్నారట ఎమ్మెల్యే. ఈ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి హామీ రాకున్నా?సిట్టింగ్‌ని కాదని ఇక్కడ పోటీకి దిగితే వ్యతిరేక ఫలితం ఉంటుందన్న అభిప్రాయం పార్టీ వర్గాలది. మరో శాసనసభ్యుడు కన్నబాబురాజు సైతం వచ్చే ఎన్నికల్లో పోటీపై హైకండ్ దగ్గర తన ప్రతిపాదనలు పెట్టారట. ఆరోగ్యపరమైన కారణాలతో తన కుమారుడు సుకుమార్ వర్మ అభ్యర్థిత్వాన్ని పరిశీలించమని కోరుతున్నారట కన్నబాబు. ఈ దశగా హామీ లభించిందనే చర్చ జరుగుతోంది. మరోవైపుడిప్యూటీ సీఎం ముత్యాల నాయుడు తన కుమార్తె కోసం ప్లాట్ ఫామ్ సిద్ధం చేయాలని బలంగా కోరుకుంటున్నారట. ముత్యాల నాయుడు కుమార్తె అనురాధ ప్రస్తుతం కె.కోటపాడు జడ్పీటీసీగా, అనకాపల్లి జిల్లా మహిళ అధ్యక్షురాలుగా పని చేస్తున్నారు. ఆమెను మాడుగుల నుంచి పోటీ చేయించాలన్న ఆలోచనలో ఉన్నారట ముత్యాల నాయుడు.

# బ్లాక్ లిస్ట్ టీచర్లకు ఇన్విలేజేషన్ డ్యూటీలు

**నిజామాబాద్:**

ఇప్పటికే పేపర్ లీకుల పేరుతో విద్యార్థులు గందరగోళానికి గురవతున్న పరిస్థితి. మరోవైపు నిజామాబాద్ జిల్లాలో విద్యాశాఖ అధికారుల తీరు ఆందోళనకు గురిచేస్తోంది. నిబంధనలు పాటించాల్సిన అధికారులు ఇష్టానుసారంగ వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పదో తరగతి పరీక్షల్లో విద్యాశాఖ అధికారులు అనుసరిస్తున్న పద్ధతి అనుమానస్పదంగా ఉంది. గతంలో మాస్ కాపీయిం గ్ చేయిస్తూ దొరికి, శాశ్వతంగా బ్లాక్ లిస్టులో పెట్టిన ఉపాధ్యాయులను ఈ ఏడాది పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో డ్యూటీలు ఎలా వేశారనే దానిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిజామాబాద్ నగరంలోని గోల్డెన్ జూబ్లీ స్కూల్ పరీక్ష కేంద్రంలో 2018లో జరిగిన పదో తరగతి పరీక్షల్లో మాస్ కాయిపీంగ్ కు సహకరించారనే ఆరోపణలపై నలుగురు టీచర్లను నాటి విద్యాశాఖ అధికారి విధుల నుంచి తొలగించారు. ఇంతే కాదు ఆ నలుగురు టీచర్లను శాశ్వతంగా ఎలాంటి పరీక్షల విధులకు కేటాయించవద్దని ఆదేశాలు కూడా జారీ చేశారు. ఇప్పుడు ఈ నిబంధనలు మార్చి అధికారులు విధులు కేటాయించడంలో మతలబేంటనే దానిపై చర్చ జరుగుతోంది. విద్యాశాఖ ఎవరి కోసం పనిచేస్తుంది? పదో తరగతి పరీక్షల్లో బ్లాక్ లిస్టులో ఉన్న ఓ ఉపాధ్యాయున్ని విద్యాశాఖ అధికారులు ఇన్విజిలేటర్ డ్యూటీ వేసినట్లు సమాచారం. దీనిపై పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ అభ్యంతరం వ్యక్తం చేసినా... అధికారులు పట్టించుకోలేదని తెలిసింది. ఓ ఉపాధ్యాయ సంఘం నాయకుడి కూతురు మోపాల్ కేంద్రంలో పదో పరీక్ష రాస్తున్నందున బ్లాక్ లిస్టులో ఉన్న టీచర్ ను ఇన్విజిలేటర్ డ్యూటీ వేయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ పీ.ఆర్.టీ.యూ ఉపాధ్యాయ సంఘం నాయకుడి కోసం విద్యాశాఖ నిబంధనలు మార్చిందా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పదో తరగతి పరీక్ష సెంటర్లలో ఆ విధులు నిర్వహించే వారిని నియమించడంలో ఉపాధ్యాయ సంఘాలు పెత్తనం చెలాయిస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది. యూనియన్ నాయకుల కనుసన్నల్లో విద్యాశాఖ - పనిచేస్తుందనేందుకు ఇది ఉదాహరణ అంటున్నారు. విద్యాశాఖను నడిపిస్తుంది ప్రభుత్వమా ఉపాధ్యాయ సంఘాలా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు మొదటి నుంచి వివాదస్పదమే అవుతోందని అంటున్నారు. పదో తరగతి పరీక్షల విధుల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెప్పిన వారికి డ్యూటీలు వేశారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఇంతకు బ్లాక్ లిస్టులో ఉన్న టీచర్లకు పరీక్ష విధులు ఎలా కేటాయించారు? నిబంధన లు సడలించారా? మరి మిగతా ముగ్గురు టీచర్లకు పదో తరగతి పరీక్షల డ్యూటీలు వేశారా వేస్తే ఎక్కడ డ్యూటీలు వేశారు వేయకుంటే ఎందుకు వేయలేదు తమకు కావల్సిన వారి పిల్లల కోసం విద్యాశాఖ అధికారులు ఏమైనా చేయగలరా? వీటన్నింటికి జిల్లా విద్యాశాఖ అధికారులు - సమాధానాలు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొందరి కోసం విద్యార్థుల జీవితాలతో ఆడుకోవటం ఏంటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యాశాఖ అనుసరిస్తున్న విధానాలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయ్. బ్లాక్ లిస్టులో పెట్టిన వారిని డ్యూటీలకు ఎలా వేస్తారు అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# వైభవంగా శ్రీ కోదండరాముడి చక్రస్నానం

**బద్వేలు**

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన శనివారం ఆలయ సమీపంలోని పుష్కరిణిలో చక్రస్నానం నేత్రపర్వంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయంలో ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు శ్రీ లక్ష్మణ సమేత సీతారాముల వారు తిరుచ్చిలో, సుదర్శన చక్రత్తాళ్వార్ పల్లకిలో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు వేంచేశారు. ఉదయం 10.30 నుండి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో సీతారామ లక్ష్మణ సరసన చక్రత్తాళ్వార్లు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో అభిషేకాలు అందుకున్నారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా



చక్రస్నానం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ధ్వజావం రోహణంతో శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిసాయి. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో నటేష్ బాబు, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనుంజయ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## వలసపాకలలో జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమం

**కాకినాడ**

మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదం ప్రజల నుంచి వచ్చిందని., జగనన్న వివిధ సభలలో చెప్పినట్లుగా గత 4 ఏళ్ళుగా ప్రభుత్వ పథకాలు ద్వారా ప్రయోజనం పొందితేనే., తమను ఆశ్వీర్వదించమ ని ఇంటింటికి వెళ్ళి కోరుతామని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తెలిపారు. కాకినాడ రూరల్ మండలం, వలసపాకల గ్రామంలో జగనన్న మా భవిషత్తు కార్యక్రమం ను కాకినాడ జిల్లా వైఎస్ఆర్ సిపి అధ్యక్షులు, కాకినాడ రూరల్ శాసన సభ్యులు కురసాల కన్నబాబు ప్రారంబించారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు కాకినాడ రూరల్ జడ్పిటిసి నురుకుర్తి రామకృష్ణ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గృహసారధులతో కలిసి ఇంటింటికి పర్యటించగా ., మహిళలు తిలకం దిద్ది హారతులు పట్టి బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో కురసాల కన్నబాబు., చంద్రబాబు ప్రభుత్వం లో జరిగిన అవకతవకలు, జగనన్న ప్రభుత్వంలో అమలు జరుపుతున్న నవరత్నాల పథకాలను వివరించారు. . గత సర్కారు కు, జగనన్న ప్రభుత్వ పాలనకు తేడాలను తెలియచేసే కరపత్రాలను సచివాలయ కన్వీనర్ల టీం అందచేస్తారని చెప్పారు .గత 46 నెలల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలను., ప్రతి ఇంటికి వెళ్ళి గృహ సారధులు వివరిస్తారని అన్నారు. ప్రభుత్వానికి మద్దత్తు తెలిపిన వారి ఇంటికి డోర్ స్టిక్కర్, మొబైలు పోనుకు వారి అనుమతితో సిఎం జగన్ పొటోను అతికిస్తారని, 5 ప్రశ్నలతో ఉన్న ప్రజా మద్దత్తు పుస్తకంలో లబ్దిదారుల అభిప్రాయాలను, గృహ సారధులు నమోదు చేస్తారని కన్నబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎంపీపీ గోపిశెట్టి పద్మజ బాబ్జి, వైసిపి నాయకుడు గీసాల శ్రీను వైసిపి గ్రామ కమిటీ నాయకులు గుత్తుల కృష్ణంరాజు, రెడ్డి నాయుడు, వైయస్సార్ రాజు , కేతా వెంకటరమణ , నందిపాటి పల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## జగన్ కు అనుభవం లేకపోవడం వల్ల సమస్యలు

**కర్నూలు:**

ఉమ్మడి కర్నూలు జిల్లా ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి సీఎం జగన్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసంతృప్తితో వున్న మాట వాస్తవమేనని దీనికి కారణం జగన్‌కు అనుభవం లేకపోవడమేనన్నారు. ఎమ్మెల్యేలతో ఎలా వుండాలన్న దానిపై జగన్ అనుభవం లేదంటున్నారు. అయితే రెండోసారి సీఎంగా అవకాశమిస్తే జగన్‌కు పూర్తి అవగాహన వస్తుందని సాయిప్రసాద్ రెడ్డి చెప్పుకొచ్చారు. కర్నూలు జిల్లా ఆదోని మండలం అరేకల్లులో ఇంటింటికి తిరుగుతూ ఈ వ్యాఖ్యలు చేశారు వైసీపీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి. దీంతో ఆయన పక్కనే ఉన్న సొంతపార్టీ నేతలు అవాక్కయ్యారు. సాయిప్రసాద్ రెడ్డి కామెంట్లపై వైఎస్ఆర్‌సీపీలో అంతర్గతంగా చర్చ జరుగుతోంది. ఉద్దేశపూర్వకంగా అన్నారా లేకపోతే తన అభిప్రాయాన్ని అలా చెప్పారా అన్న దానిపై హైకమాండ్ సన్నిహితులు ఆరా తీస్తున్నారు. ఇటీవల వైఎస్ఆర్‌సీపీలో ఎమ్మెల్యేల అసంతృప్తి అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నలుగురు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేశారు. ఆ సమయంలోనే ఇరవై మందికిపైగా ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని గుర్తించి వారితో సీఎం జగన్ ప్రత్యేకంగా మాట్లాడినట్లుగా తెలుస్తోంది. కానీ వారిలో అసంతృప్తి తగ్గలేదని చెబుతున్నారు. మరో వైపు తెలుగుదేశం పార్టీ వైఎస్ఆర్‌సీపీతో మైండ్ గేమ్ ఆడుతోంది. తమతో నలభై మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే వాటిని కొట్టి పారేయలేమన్న వాతావరణం ఉండటంతో సాయి ప్రసాద్ రెడ్డి లాంటి ఎమ్మెల్యేలు అన్యాపదేశంగా చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్ అవుతున్నాయి. సీఎం జగన్ వచ్చే ఎన్నికల్లో ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విషయంలో కఠినంగా ఉండాలని అనుకుంటున్నారు. గతంలో ఇదే విషయాన్ని నేరుగా చెప్పి తనకు ఎంత సన్నిహితులైనా సర్వేల్లో బాగా లేకపోతే టిక్కెట్లు ఇచ్చేది లేదని ప్రకటించేవారు

ప్రజా తపన
prajathapana.com

# 'మళ్లీ పెళ్లి' టీజర్ ఏప్రిల్ 13న విడుదల



నవరసరాయ డా.నరేష్ వికె పరిశ్రమలో 50 గోల్డెన్ ఇయర్స్ ని పూర్తి చేసుకున్నారు. నరేష్, పవిత్రా లోకేష్ కలసి నటిస్తున్న గోల్డెన్ జూబ్లీ ప్రాజెక్ట్ 'మళ్లీ పెళ్లి' విడుదలకు సిద్ధమవుతోంది. తెలుగు-కన్నడ ద్విభాషా చిత్రానికి మెగా మేకర్ ఎంఎస్ రాజు దర్శకత్వం వహించగా, విజయ కృష్ణ మూవీస్ బ్యానర్‌పై నరేష్ స్వయంగా నిర్మిస్తున్నారు. మేకర్స్ ఇంతకుముందు విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్ లో లీడ్ పెయిర్ అందమైన కెమిస్ట్రీ ఆకట్టుకుంది. ఈ రోజు ఈ చిత్రం టీజర్ గురించి ఎక్సయిటింగ్ అప్‌డేట్‌తో వచ్చారు. టీజర్ ఏప్రిల్ 13న విడుదల కానుంది. నరేష్, విత్ర లోకేష్ అందమైన చిరునవ్వుతో లవ్ సింబల్స్ చూపిస్తూ కనిపించారు. నరేష్ సూట్ వేసుకోగా, పవిత్ర లోకేష్ చీరలో ఆకట్టుకున్నారు. జయసుధ, శరత్‌బాబు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో వనిత విజయకుమార్, అనన్య నాగెళ్ల, రోషన్, రవివర్మ, అన్నపూర్ణ, భద్రం, యుక్త, ప్రవీణ్ యండమూరి, మధు తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సురేష్ బొబ్బిలి సంగీతం అందిస్తుండగా, అరుల్ దేవ్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఎంఎన్ బాల్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ చిత్రానికి జునైద్ సిద్ధిక్ ఎడిటర్. అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, భాస్కర్ ముదావత్ ప్రొడక్షన్ డిజైనర్.'మళ్ళీ పెళ్లి' ఈ వేసవిలో విడుదల కానుంది.

తారాగణం: డాక్టర్ నరేష్ వికె, పవిత్ర లోకేష్, జయసుధ, శరత్ బాబు, వనిత విజయకుమార్, అనన్య నాగెళ్ల, రోషన్, రవివర్మ, అన్నపూర్ణ, భద్రం, యుక్త, ప్రవీణ్ యండమూరి, మధు తదితరులు

# ఏప్రిల్ 15న రిలీజ్ కానున్న వెట్రిమారన్ "విడుదల పార్ట్ 1"



కోలీవుడ్ అగ్ర దర్శకులలో ఒకరైన వెట్రిమారన్ తాజా చిత్రం విడుతలై పార్ట్ 1. వెట్రిమారన్ రచించి, దర్శకత్వం వహించిన ఈ పీరియాడిక్ పోలీస్ ప్రొసీజర్ క్రైమ్ థ్రిల్లర్ చిత్రం మార్చి 31న తమిళనాడు అంతటా మరియు ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలలో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఈ చిత్రాన్ని తెలుగులో 'గీత ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్' ద్వారా ఏప్రిల్ 15న విడుదల చేస్తున్నారు.

సినిమా విడుదలకు ముందు, ఈరోజు మేకర్స్ ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేశారు. విచారణ పేరుతో మహిళలను చిత్రహింసలకు గురిచేస్తున్న పోలీసులపై పెరుమాళ్ మాస్టర్ (విజయ్ సేతుపతి ) పోరాటం మరియు అతని కోసం పోలీసు బలగాలు వెతకడం గురించి ఈ ట్రైలర్ లో అర్థమవవుతుంది.

సూరి ఈ చిత్రంలో కానిస్టేబుల్ కుమరేశన్ గా నటిస్తున్నారు.

ఈ చిత్రంలో విజయ్ సేతుపతి నటించినప్పటికీ, చిత్ర కథానాయకుడు సూరి అని తెలుస్తుంది. అన్యాయం గురించి అతను పడే నిరాశ మరియు అసమర్థతను కూడా ట్రైలర్‌లో చూపించారు. పెరుమాళ్‌కు ఏం జరుగుతుంది, చివరకు ఎవరు పట్టుకుంటారు అనేది కథ. వెట్రిమారన్ రియలిస్టిక్ టేకింగ్, అరెస్టింగ్ స్కోర్ మరియు చివర్లో సూరి స్టంట్స్ అందరినీ ఆశ్చర్యపరుస్తాయి.

ఈ పీరియాడిక్ పోలీస్ ప్రొసీజర్ క్రైమ్ థ్రిల్లర్ చిత్రాన్ని చూసేందుకు అభిమానులు చాలా ఉత్సాహంగా ఉన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్‌డేట్‌లు త్వరలో వెల్లడి కానున్నాయి. ఈ చిత్రంలో భవానీ శ్రీ, ప్రకాష్ రాజ్, గౌతమ్ వాసుదేవ్ మీనన్, రాజీవ్ మీనన్, చేతన్ మరియు పలువురు నటించారు, వెట్రిమారన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఖీూ ఇన్ఫోటైన్‌మెంట్ మరియు గ్రాస్ రూట్ ఫిల్మ్ కంపెనీ బ్యానర్‌లపై ఎల్రెడ్ కుమార్ నిర్మించారు. ఆర్ వేల్‌రాజ్ సినిమాటోగ్రాఫర్ పనిచేశారు. మాస్ట్రో ఇళయరాజా చిత్రం మొత్తం సౌండ్‌ట్రాక్‌ను కంపోజ్ చేశారు.










Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950